TGTEL/26/A2635

# DD9 వార్త

వాస్తవాలు పలుకు

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి: 02 | సంచిక: 65 | 18-07-2026 శనివారం | పేజీలు: 08 | వెల: 3/-

చౌటపల్లిలో కన్నుల పండువగా జగన్నాథుని రథయాత్ర







# ధరణి లావాదేవీలపై సిట్ దర్యాప్తు..

సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ముగిసిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

గత ప్రభుత్వ హయాంలో జరిగిన ధరణి లావాదేవీలపై సమగ్ర విచారణకు గ్రీన్ సిగ్నల్

వివిధ శాఖల అధికారులు, నిపుణులతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు

భూ లావాదేవీల్లో అక్రమాలు, అవకతవకలపై లోతైన విచారణకు నిర్ణయం

ధరణి పోర్టల్‌లో జరిగిన అన్ని కీలక లావాదేవీలను పరిశీలించనున్న సిట్

గ్రామ పంచాయతీల సొంత ఆదాయం నేరుగా ఆయా ఖాతాల్లోనే జమ చేయాలని ఆమోదం

స్థానిక సంస్థల ఆర్థిక స్వయం ప్రతిపత్తికి ప్రభుత్వం ప్రాధాన్యం

పంచాయతీల నిధుల వినియోగంలో పారదర్శకత పెంచడమే ప్రభుత్వ లక్ష్యం

పలు పరిపాలనా, అభివృద్ధి అంశాలపైనా మంత్రివర్గంలో విస్తృత చర్చ

త్వరలో పూర్తి స్థాయి కేబినెట్ నిర్ణయాలను అధికారికంగా వెల్లడించనున్న ప్రభుత్వం



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో అమల్లో ఉన్న ధరణి పోర్టల్ ద్వారా జరిగిన భూ లావాదేవీలపై సమగ్ర విచారణ చేపట్టాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ అంశంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసి అన్ని లావాదేవీలను క్షుణ్ణంగా పరిశీలించాలని నిర్ణయించింది.
ధరణి పోర్టల్ అమలులో జరిగిన భూ రిజిస్ట్రేషన్లు, భూముల బదిలీలు, యాజమాన్య మార్పులు, ఫిర్యాదులు, వివాదాస్పద లావాదేవీలు, ప్రభుత్వ భూములకు సంబంధించిన అంశాలు సహా అన్ని కోణాల్లో విచారణ జరపాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఇందుకోసం రెవెన్యూ, రిజిస్ట్రేషన్,

మిగతా 3లో..




## బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సభ'కు షరతులతో హైకోర్టు గ్రీన్ సిగ్నల్

నేటి బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సభ'కు హైకోర్టు అనుమతి

శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో భారీ బహిరంగ సభ

పోలీసులు అనుమతి నిరాకరించడంతో కోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్

శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా నిర్వహించుకోవాలని స్పష్టమైన షరతులు

ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించనున్న కేటీఆర్

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) శనివారం హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన 'యువ సంగ్రామ సభ'కు తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. సరూర్‌నగర్ స్టేడియంలో జరగనున్న ఈ సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో, బీఆర్ఎస్ శుక్రవారం హైకోర్టును ఆశ్రయించింది. లంచ్ మోషన్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సభ నిర్వహించాలని స్పష్టం చేస్తూ అనుమతించింది. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఈ సభను నిర్వహిస్తోంది. ముఖ్యంగా ప్రియాంక గాంధీ ప్రకటించిన 'యూత్ డిక్లరేషన్' అమలు,

మిగతా 2లో..




## అంతరిక్షంలోకి ప్రధాని మోదీ రాసిన పోస్ట్‌కార్డు

రేపు శ్రీహరికోట నుంచి 'విక్రమ్-1' ప్రయోగం

'మిషన్ ఆగమన్'కు స్కైరూట్ సన్నాహాలు

మోదీ చేతిరాతలో 'వందేమాతరం'

వందలాది చేతిరాత పోస్ట్‌కార్డులకు అంతరిక్ష యాత్ర

ఇస్రో మాజీ, ప్రస్తుత చైర్మన్ల సందేశాలు కూడా

భారత గడ్డపై నుంచి తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్

3డీ ప్రింటింగ్‌తో తయారైన రాకెట్ ఇంజిన్లు

350 కిలోల పేలోడ్‌ను కక్ష్యలోకి తీసుకెళ్లే సామర్థ్యం

సీవీ రామన్, సారాభాయ్, కలాంకు వినూత్న నివాళి

## ప్రభుత్వ ఉద్యోగులకు నగదు రహిత వైద్యం

కొత్త ఈహెచ్‌ఎస్ పోర్టల్ ప్రారంభం

ప్రభుత్వ ఉద్యోగుల నూతన ఆరోగ్య పథకం (ఈహెచ్‌ఎస్) పోర్టల్‌ను ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.

* ఉద్యోగుల ఎన్నో ఏళ్ల డిమాండ్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కారం చూపిందని వ్యాఖ్య.
* పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శ.
* 9.5 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రయోజనం చేకూరేలా కొత్త ఈహెచ్‌ఎస్.
* బీఆర్ఎస్ పెండింగ్‌లో పెట్టిన రూ.2 వేల కోట్ల బిల్లులను తమ ప్రభుత్వం చెల్లించిందని వెల్లడి.




## రాష్ట్రంలో 60 శాతం సర్ డిజిటైజేషన్ పూర్తి

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సుదర్శన్‌రెడ్డి వెల్లడి

సంగారెడ్డిలో సర్ శిబిరాల పరిశీలన

బీఎల్వోలతో మాట్లాడిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్

గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం పూర్తి

పట్టణాల్లో 45 శాతం డిజిటైజేషన్

పార్టీ ప్రతినిధుల గుర్తింపు కార్డులపై ఆరా

గడువు దృష్టిలో పెట్టుకుని ప్రక్రియ వేగవంతం చేయాలని సూచన

పీఎల్వో, బీఎల్వోల సహకారంతో కొనసాగుతున్న సర్

ఎన్యూమరేషన్ పత్రాలపై అధికారులకు కీలక ఆదేశాలు



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

రాష్ట్రంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని

మిగతా 2లో..

## గుజరాత్‌లో జైషే మహ్మద్ ఉగ్ర కుట్ర భగ్నం

ఏటీఎస్ అదుపులో ఐదుగురు ముష్కరులు

విఫలమైన టైమ్ బాంబు పరీక్ష

ఉగ్రవాద నెట్‌వర్క్‌పై గుజరాత్ ఏటీఎస్ సర్జికల్ స్ట్రైక్

జులై 24 వరకు పోలీస్ కస్టడీకి అప్పగించిన న్యాయస్థానం

మేజిస్ట్రేట్ ఆర్.ఎం భాటియా ముందు నిందితుల హాజరు

నిందితులపై 'ఉపా' చట్టం కింద కఠినమైన సెక్షన్లతో కేసులు

దేశద్రోహ శక్తులపై ఉక్కుపాదం మోపిన అధికారులు



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

పాకిస్థాన్ సరిహద్దులను ఆనుకుని ఉన్న గుజరాత్ రాష్ట్రంలో భారీ ఉగ్రవాద కుట్రను భద్రతా బలగాలు విజయవంతంగా భగ్నం చేశాయి. పాక్ కేంద్రంగా

మిగతా 2లో..

విద్యార్థితో ఇస్లామిక్ ప్రార్థనలు?..

## పాఠశాలపై కేసు

సైదాబాద్‌లో ప్రైవేట్ స్కూల్‌పై తల్లిదండ్రుల ఫిర్యాదు

రెండో తరగతి విద్యార్థితో 'సూరా అల్-ఫాతిహా' పఠనం చేయించారనే ఆరోపణ

రోజూ ప్రార్థన చేయాలంటూ స్కూల్ డైరీలో నమోదు చేశారని ఫిర్యాదు

బాలుడు భయాందోళనకు గురవుతున్నాడని తల్లిదండ్రుల ఆవేదన

ప్రిన్సిపాల్, యాజమాన్యం, టీచర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

హైదరాబాద్ నగరంలోని సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో రెండో తరగతి విద్యార్థితో బలవంతంగా ఇస్లామిక్ ప్రార్థనలు చేయించారనే ఆరోపణలు తీవ్ర వివాదానికి దారితీశాయి. ఈ ఘటనపై బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు

మిగతా 2లో..




## దేశంలోనే తొలి హైడ్రోజన్ రైలు ప్రారంభం

జెండా ఊపిన ప్రధాని నరేంద్ర మోదీ

పర్యావరణ పరిరక్షణలో భారత రైల్వే సరికొత్త చరిత్ర:

హరియాణాలో పట్టాలెక్కిన మొదటి హైడ్రోజన్ రైలు

జింద్ టు సోనిపట్ మధ్య పచ్చజెండా ఊపిన ప్రధాని

89 కిలోమీటర్ల దూరాన్ని రెండు గంటల్లోనే చేరిక

ప్రపంచంలోనే అతి పొడవైన ప్యాసింజర్ హైడ్రోజన్ రైలు

10 కోచ్‌లతో ఏకంగా 2,600 మంది ప్రయాణించేలా రికార్డు సృష్టి

సొంతంగా కరెంట్ తయారుచేసుకునే అద్భుత సాంకేతికత


పర్యావరణానికి ముప్పు లేని విప్లవాత్మక ఫ్యూయల్ సెల్ టెక్నాలజీ

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

భారతదేశ రవాణా రంగంలో పర్యావరణ విప్లవానికి నాంది పలుకుతూ భారతీయ రైల్వే ఒక అద్భుతమైన చారిత్రాత్మక ఘట్టాన్ని ఆవిష్కరించింది. పర్యావరణానికి ఎలాంటి కాలుష్య భారం లేదా నష్టం వాటిల్లకుండా, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేసే క్రమంలో దేశంలోనే మొట్టమొదటిసారిగా హైడ్రోజన్ ఇంధనంతో నడిచే సరికొత్త రైలు పట్టాలెక్కింది. హరియాణా రాష్ట్ర వేదికగా ఈ సరికొత్త సాంకేతిక రైలు తన తొలి ప్రయాణాన్ని అత్యంత విజయవంతంగా ప్రారంభించి, భారత రైల్వే చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది.
హరియాణాలోని జింద్ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అధికారిక కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ హైడ్రోజన్ రైలును పచ్చజెండా ఊపి,

మిగతా 2లో..



# బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సభ'కు షరతులతో హైకోర్టు గ్రీన్ సిగ్నల్

మొదటిపేజీ తరువాయి

నిరుద్యోగ సమస్య, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో జాప్యం వంటి అంశాలను ఈ సభ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించనున్నారు.

కోర్టులో విచారణ సందర్భంగా, ఇంటెలిజెన్స్ నివేదికల ప్రకారం శాంతిభద్రతల సమస్యలు తలెత్తవచ్చని, పార్కింగ్ సౌకర్యం కూడా సరిగా లేదని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం, 17 రోజుల క్రితమే దరఖాస్తు చేసుకున్నా ఎందుకు నిర్ణయం తీసుకోలేదని అధికారులను ప్రశ్నించింది. చివరికు, రోడ్లను దిగ్బంధించడం లేదా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకుండా సభను శాంతియుతంగా నిర్వహించాలని బీఆర్ఎస్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# రాష్ట్రంలో 60 శాతం సర్ డిజిటైజేషన్ పూర్తి

మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా సర్ ప్రక్రియలో 60 శాతం డిజిటైజేషన్ పూర్తయిందని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రక్రియ 80 శాతం పూర్తికాగా, పట్టణ ప్రాంతాల్లో 45 శాతం డిజిటైజేషన్ పూర్తయిందని వివరించారు.

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని సుల్తాన్‌పూర్, ఐలాపూర్, పటాన్‌చెరులో ఏర్పాటు చేసిన సర్ శిబిరాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి సుదర్శన్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. శిబిరాల్లో జరుగుతున్న నమోదు, డిజిటైజేషన్, పత్రాల పరిశీలన తదితర అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులతో (బీఎల్వోలు) నేరుగా మాట్లాడిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, ప్రజల నుంచి వస్తున్న స్పందన, నమోదు ప్రక్రియ పురోగతి గురించి ఆరా తీశారు. డిజిటైజేషన్ పనులు వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

శిబిరాల వద్ద వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు ఉండటాన్ని గమనించిన సుదర్శన్‌రెడ్డి, వారికి పార్టీ గుర్తింపు కార్డులు జారీ చేశారా అని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా మాత్రమే ప్రక్రియ నిర్వహించాలని, పారదర్శకతకు ఎలాంటి భంగం కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సర్ ప్రక్రియ గడువు పొడిగించిన నేపథ్యంలో మిగిలిన పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించేలా ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా ప్రక్రియ కొనసాగించాలని చెప్పారు. పీఎల్వోలు, బీఎల్వోల సమన్వయంతో సర్ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా సజావుగా సాగుతోందన్నారు. ఎన్యూమరేషన్ పత్రాలు అందని ప్రాంతాల్లో వెంటనే సంబంధిత సూపర్‌వైజర్లను సంప్రదించి పత్రాలు తీసుకోవాలని బీఎల్వోలకు సూచించారు. అవసరమైన ఫారాలు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సర్ ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేసి, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించడమే ఎన్నికల సంఘం లక్ష్యమని సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజలు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థితో ఇస్లామిక్ ప్రార్థనలు?.. పాఠశాలపై కేసు

మొదటిపేజీ తరువాయి

నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఫిర్యాదు ప్రకారం, తరగతి గదిలో సదరు విద్యార్థితో ఇస్లామిక్ ప్రార్థనలో భాగమైన 'సూరా అల్‌ఫాతిహా' పఠనం చేయాలని ఉపాధ్యాయులు ఆదేశించినట్లు ఆరోపించారు. అంతేకాకుండా, ప్రతిరోజూ ఆ ప్రార్థన చదవాలని స్కూల్ డైరీలో కూడా సూరా అల్‌ఫాతిహా అని రాసి ఒత్తిడి తీసుకొచ్చారని తల్లిదండ్రులు పేర్కొన్నారు.

తమ మత విశ్వాసాలకు విరుద్ధంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు వ్యవహరించారని, దీంతో తమ కుమారుడు తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ప్రతిరోజూ ఏడుస్తూ ఇంటికి వస్తున్నాడని తల్లిదండ్రులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ చర్యల వల్ల తమ మత స్వేచ్ఛతో పాటు తల్లిదండ్రుల హక్కులు కూడా ఉల్లంఘించబడ్డాయని ఆరోపిస్తూ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ ఫిర్యాదు ఆధారంగా సైదాబాద్ పోలీసులు ప్రాథమిక సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) నమోదు చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్, యాజమాన్యం, తరగతి ఉపాధ్యాయురాలిని నిందితులుగా చేర్చినట్లు తెలిపారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సంబంధిత సెక్షన్లతో పాటు జువెనైల్ జస్టిస్ చట్టంలోని సెక్షన్ 75 కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

విద్యార్థిపై మానసిక ఒత్తిడి తెచ్చారనే ఆరోపణలపై అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు, పాఠశాల యాజమాన్యం వివరణ, ఇతర ఆధారాలను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ఘటనపై పాఠశాల యాజమాన్యం స్పందన ఇంకా వెల్లడికాలేదు. పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు నగదు రహిత వైద్యం

- **కొత్త ఈహెచ్ఎస్ పోర్టల్ ప్రారంభం**
- **ప్రభుత్వ ఉద్యోగుల నూతన ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) పోర్టల్‌ను ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.**
- **ఉద్యోగుల ఎన్నో ఏళ్ల డిమాండ్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కారం చూపిందని వ్యాఖ్య.**
- **పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శ.**
- **9.5 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రయోజనం చేకూరేలా కొత్త ఈహెచ్ఎస్.**
- **బీఆర్ఎస్ పెండింగ్‌లో పెట్టిన రూ.2 వేల కోట్ల బిల్లులను తమ ప్రభుత్వం చెల్లించిందని వెల్లడి.**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

ప్రభుత్వ ఉద్యోగులకు నగదు రహిత వైద్య సేవలు అందించేందుకు నూతన ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) పోర్టల్‌ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఉద్యోగ సంఘాల నేతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. నగదు రహిత చికిత్స కోసం ఉద్యోగులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూశారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని నెరవేర్చిందని తెలిపారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సమన్వయంతో పనిచేసిందని భట్టి చెప్పారు. ఇకపై వైద్య ఖర్చుల విషయంలో ప్రభుత్వ ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రాష్ట్రంలో కొత్త అధ్యాయం ప్రారంభమైందన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర కీలకమని, వారిని ప్రభుత్వం కుటుంబ సభ్యుల్లా భావిస్తోందని పేర్కొన్నారు.

సుమారు 9.5 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త ఈహెచ్ఎస్‌ను తీసుకొచ్చామని తెలిపారు. విద్య, వైద్య రంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.10 లక్షలకు పెంచి 1.06 కోట్ల మంది పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన రూ.2 వేల కోట్ల బిల్లులను తమ ప్రభుత్వం ఇప్పటికే క్లియర్ చేసిందని భట్టి విక్రమార్క తెలిపారు.

# గుజరాత్‌లో జైషే మహ్మద్ ఉగ్ర కుట్ర భగ్నం

మొదటిపేజీ తరువాయి

పనిచేస్తున్న నిషేధిత ఉగ్రసంస్థ జైషే మహ్మద్‌కు చెందిన ఒక ప్రమాదకరమైన ముఠాను గుజరాత్ ఉగ్రవాద నిరోధక దళం అధికారులు అరెస్టు చేశారు. పటన్ జిల్లా పరిధిలోని సిద్ధ్‌పూర్ తాలూకా ఖడియాల్ గ్రామంలో ఏటీఎస్ బృందాలు జరిపిన మెరుపు దాడుల్లో ఐదుగురు ముష్కరులు పట్టుబడ్డారు. అదుపులోకి తీసుకున్న నిందితులను బిలాల్ అబిద్‌భాయ్ షేరా, మహ్మద్ అయూబ్ కడివాలా, మహ్మద్ పాలన్‌పురి, షఫియా రాయిస్ ముక్తి, మహ్మద్ హసన్ కర్దియాగా అధికారులు అధికారికంగా గుర్తించారు.

ఖడియాల్ గ్రామంలో పట్టుబడిన ఈ ఐదుగురు జైషే మహ్మద్ నిందితులను గుజరాత్ ఏటీఎస్ అధికారులు కట్టుదిట్టమైన భద్రత మధ్య మెహసానా జిల్లా కోర్టుకు తరలించారు. అక్కడ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆర్.ఎం భాటియా ఎదుట నిందితులను హాజరుపరిచారు. ఈ ఉగ్రవాద ముఠా వెనుక ఉన్న అంతర్జాతీయ లింకులు, భవిష్యత్ దాడుల ప్రణాళికలను రాబట్టడానికి నిందితులను విచారించాల్సిన అవసరం ఉందని ఏటీఎస్ కోర్టుకు విన్నవించింది. ఏటీఎస్ వాదనలతో ఏకీభవించిన మేజిస్ట్రేట్ ఆర్.ఎం భాటియా.. నిందితులు ఐదుగురిని ఈనెల జులై 24వ తేదీ వరకు ఏటీఎస్ పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గుజరాత్ రాష్ట్రంలో అలజడి సృష్టించేందుకు, యువతను ఉగ్రవాదం వైపు ఆకర్షించేందుకు ఈ ముఠా ప్రయత్నిస్తోందని ప్రాథమిక విచారణలో తేలింది. దేశ సార్వభౌమత్వానికి భంగం కలిగించేలా వ్యవహరించిన ఈ నిందితులపై దేశంలోనే అత్యంత కఠినమైన చట్టవిరుద్ధ కార్యకలాపాల నివారణ చట్టం కింద కేసులు నమోదు చేశారు. 'ఉపా' చట్టంలోని సెక్షన్లు 13, 17, 18, 38, 39లతో పాటు భారతీయ న్యాయ సంహిత (BNS)లోని సెక్షన్లు 148, 61 కింద నిందితులపై దేశద్రోహం, ఉగ్రవాద నిధుల సేకరణ, కుట్రపూరిత చర్యల కింద కేసులు నమోదు చేసి ఉక్కుపాదం మోపారు. ఈ తాజా అరెస్టులు ఆకస్మికంగా జరిగినవి కావు, గత కొన్ని రోజులుగా ఏటీఎస్ జరుపుతున్న సుదీర్ఘ దర్యాప్తులో భాగమేనని అధికారులు స్పష్టం చేశారు. అంతకుముందు జులై 3వ తేదీన గుజరాత్‌లో ఉగ్ర నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు ప్రయత్నిస్తున్న జైషే మహ్మద్‌కు చెందిన ఎనిమిది మంది ముష్కరులను ఏటీఎస్ విజయవంతంగా పట్టుకుంది. ఆ ఎనిమిది మంది నిందితులను ప్రత్యేక బృందాలు థర్డ్ డిగ్రీ మరియు శాస్త్రీయ పద్ధతుల్లో విచారించగా, వారి ఇచ్చిన సమాచారం మరియు కీలక లీకుల ఆధారంగానే తాజాగా పటన్ జిల్లాలో తలదాచుకున్న ఈ ఐదుగురు నిందితుల పేర్లు మరియు రహస్య స్థావరాల వివరాలు బయటపడ్డాయి.

కోర్టు విచారణ సందర్భంగా ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీఆర్ దంతానీ న్యాయస్థానానికి ఒక సంచలన విషయాన్ని వివరించారు. అరెస్టైన ఐదుగురు నిందితులలో ఒకరు గుజరాత్ మట్టిపై భారీ పేలుడు సంభవించేలా ఒక ప్రమాదకరమైన క్రూడ్ టైమ్ బాంబును సొంతంగా తయారు చేయడానికి ప్రయత్నించాడని కోర్టుకు తెలిపారు. అంతటితో ఆగకుండా, తయారు చేసిన ఆ బాంబు పనితీరును పరీక్షించేందుకు (టెస్టింగ్) ఒక నిర్మానుష్య ప్రాంతంలో విఫల యత్నం కూడా చేశాడని ఏటీఎస్ దర్యాప్తులో తేలిందని పీఆర్ దంతానీ న్యాయమూర్తికి వివరించారు. నిందితులను కస్టడీకి కోరడానికి గల కారణాలను పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీఆర్ దంతానీ కోర్టు ముందు ఉంచారు. నిందితులు టైమ్ బాంబును పరీక్షించడానికి ప్రయత్నించినప్పటికీ అది సాంకేతిక లోపాల వల్ల విఫలమైందని, అయితే వారు బాంబు తయారీకి ఉపయోగించిన ముడి సరుకులు, రసాయనాలు ఎక్కడి నుంచి సేకరించారు? వాటిని ప్రస్తుతం ఎక్కడ దాచిపెట్టారు? అనే విషయాలను కనుగొనాల్సి ఉందన్నారు. అలాగే నిందితుల వద్ద ఉర్దూ భాషలో ఉన్న జైషే మహ్మద్ ఉగ్రవాద ప్రచార సాహిత్యానికి సంబంధించిన నిషేధిత పుస్తకాలు ఉన్నాయని, వాటిని ఇంకా స్వాధీనం చేసుకోవాల్సి ఉన్నందున నిందితుల రహస్య స్థావరాలకు తీసుకెళ్లి శోధించాల్సి ఉందని తెలిపారు.

గుజరాత్ ఏటీఎస్ జరిపిన లోతైన విచారణలో ఈ ఉగ్రవాద మాడ్యూల్ యొక్క సరఫరాదారుల లింకులు కూడా బయటపడ్డాయి. జులై 3న అరెస్టయిన మొదటి ముఠాలోని కీలక సభ్యుడైన మహమ్మద్ అమీన్ షేరా అనే ముష్కరుడు, తాజాగా పట్టుబడిన ఈ ఐదుగురు సభ్యుల ముఠాకు బాంబు తయారీకి కావలసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని, పేలుడు పదార్థాల సామగ్రిని సరఫరా చేసినట్లు ఏటీఎస్ అధికారులు గుర్తించారు. జైషే మహ్మద్ తన ఉగ్రవాద నెట్‌వర్క్‌ను గుజరాత్‌లో బలంగా నాటడానికి ఈ ఇరు ముఠాలను ఒకదానికొకటి అనుసంధానం చేస్తూ వెనుక నుండి నడిపించిన అసలు సూత్రధారులు ఎవరనే కోణంలో దర్యాప్తు వేగవంతమైంది.

జైషే మహ్మద్ ఉగ్రసంస్థ గుజరాత్‌లోని ప్రముఖ నగరం అహ్మదాబాద్‌ను ప్రధాన కేంద్రంగా చేసుకుని రాష్ట్రవ్యాప్తంగా తమ నెట్‌వర్క్‌ను ఒక వ్యూహం ప్రకారం విస్తరించడానికి ప్రయత్నించిందని ఏటీఎస్ స్పష్టం చేసింది. జులై 3న దొరికిన అహ్మద్, ఇబ్రహీం, ముదస్సిర్, జకారియా దురానీ, ముఫ్తీ ఫౌజాన్, మహమ్మద్ అమీన్ షేరా, మహమ్మద్ అబ్దుల్, బిలాల్ మహమ్మద్ లలో ఏడుగురు గుజరాత్‌కు చెందినవారు కాగా, ఒకరు మధ్యప్రదేశ్‌కు చెందినవారని తెలిపారు. వీరి మొబైల్ ఫోన్లను విశ్లేషించగా వందల సంఖ్యలో దేశ వ్యతిరేక డిజిటల్ ఫైళ్లు, చాటింగ్‌లు లభ్యమయ్యాయి. ఈ మాడ్యూల్ కేవలం గుజరాత్‌కే పరిమితం కాకుండా దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా విస్తరించే ప్రమాదకరమైన ప్లాన్ చేసిందని, తాజా అరెస్టులతో ఆ కుట్రలన్నీ పూర్తిగా భగ్నమయ్యాయని ఏటీఎస్ అధికారులు వెల్లడించారు.

# అంతరిక్షంలోకి ప్రధాని మోదీ రాసిన పోస్ట్‌కార్డు

- **నేడు శ్రీహరికోట నుంచి 'విక్రమ్-1' ప్రయోగం**
- **'మిషన్ ఆగమన్'కు స్కైరూట్ సన్నాహాలు**
- **మోదీ చేతిరాతలో 'వందేమాతరం'**
- **వందలాది చేతిరాత పోస్ట్‌కార్డులకు అంతరిక్ష యాత్ర**
- **ఇస్రో మాజీ, ప్రస్తుత చైర్మన్ల సందేశాలు కూడా**
- **సీవీ రామన్, సారాభాయ్, కలాంకు వినూత్న నివాళి**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

భారత అంతరిక్ష రంగంలో మరో చారిత్రక ఘట్టానికి రంగం సిద్ధమైంది. ప్రైవేట్ అంతరిక్ష సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ 'మిషన్ ఆగమన్' పేరిట రూపొందించిన 'విక్రమ్1' రాకెట్‌ను శనివారం శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించనుంది. భారత భూభాగం నుంచి కక్ష్యలోకి వెళ్లనున్న తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్‌గా విక్రమ్1 ప్రత్యేక గుర్తింపు పొందుతోంది.

ఈ ప్రయోగంలో సాంకేతిక పరికరాలతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా చేతితో రాసిన ఒక ప్రత్యేక పోస్ట్‌కార్డును కూడా అంతరిక్షంలోకి పంపనున్నారు. ఆ పోస్ట్‌కార్డుపై ప్రధాని 'వందేమాతరం' అని రాయడం విశేషం. ఇది భారత అంతరిక్ష ప్రయాణంలో ఒక ప్రతీకాత్మక గుర్తుగా నిలవనుంది.

ప్రధాని మోదీ పోస్ట్‌కార్డుతో పాటు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రస్తుత, మాజీ చైర్మన్లు, భారతీయ వ్యోమగాములు, స్కైరూట్ సంస్థ బృందం, సంస్థలో పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్లు, విధాన రూపకర్తలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రేయోభిలాషులు రాసిన వందలాది చేతిరాత పోస్ట్‌కార్డులను కూడా విక్రమ్1 అంతరిక్షంలోకి తీసుకెళ్లనుంది. భారత అంతరిక్ష రంగ అభివృద్ధికి తోడ్పడిన అనేక మంది జ్ఞాపకాలను ఈ ప్రయోగం సాక్ష్యంగా నిలపనుంది.

**భారత ప్రైవేట్ అంతరిక్ష రంగానికి మైలురాయి**

విక్రమ్1 రాకెట్ దాదాపు ఏడు అంతస్తుల భవనం ఎత్తు ఉంటుంది. పూర్తిగా కార్బన్ కాంపోజిట్ పదార్థంతో దీనిని తయారు చేశారు. రాకెట్‌లోని ఇంజిన్లను అత్యాధునిక 3డీ ప్రింటింగ్ సాంకేతికతతో రూపొందించారు. భూమికి సమీప కక్ష్య (లో ఎర్త్ ఆర్బిట్)లోకి సుమారు 350 కిలోల పేలోడ్‌ను తీసుకెళ్లే సామర్థ్యం దీనికి ఉంది.

**విక్రమ్-ఎస్ విజయంతో ముందడుగు**

2022 నవంబరులో స్కైరూట్ సంస్థ 'విక్రమ్‌ఎస్' అనే సబ్‌ఆర్బిటల్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించి భారత ప్రైవేట్ అంతరిక్ష రంగంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. ఇప్పుడు పూర్తి స్థాయి ఉపగ్రహాలను కక్ష్యలోకి తీసుకెళ్లగల 'విక్రమ్1'తో మరో కీలక ఘట్టాన్ని నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

**ముగ్గురు మహా శాస్త్రవేత్తలకు వినూత్న నివాళి**

విక్రమ్1 రాకెట్‌లో సాంకేతిక పరికరాలు, పోస్ట్‌కార్డులతో పాటు ప్రత్యేక మైక్రోఆర్ట్‌ను కూడా అంతరిక్షంలోకి పంపనున్నారు. భారత దేశానికి చెందిన ప్రముఖ శాస్త్రవేత్తలు సర్ సీవీ రామన్, డాక్టర్ విక్రమ్ సారాభాయ్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సూక్ష్మ విగ్రహాలను ఈ ప్రయోగంలో పంపించనున్నారు.

మైక్రో ఆర్టిస్ట్ అజయ్ కుమార్ మట్టెవాడ 18 క్యారెట్ల బంగారంతో చిన్న రాకెట్ ఆకృతిని రూపొందించి, అందులో ఈ ముగ్గురు శాస్త్రవేత్తల సూక్ష్మ విగ్రహాలను చెక్కారు. భారత అంతరిక్ష రంగానికి వారు అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా స్కైరూట్ ఈ వినూత్న నివాళిని అర్పిస్తోంది. 'మిషన్ ఆగమన్' విజయవంతమైతే భారత ప్రైవేట్ అంతరిక్ష రంగానికి ఇది మరో గొప్ప మైలురాయిగా నిలవడంతో పాటు ప్రపంచ వాణిజ్య ఉపగ్రహ ప్రయోగ మార్కెట్లో భారత ప్రైవేట్ సంస్థల సామర్థ్యాన్ని మరింత బలంగా చాటనుంది.

# మీనాక్షి నామినేషన్ తిరస్కరణపై సీఈసీ కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ వ్యవహారంపై కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో నిబంధనల అమలు విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. మీడియాతో నిర్వహించిన ప్రత్యేక చిట్‌చాట్‌లో ఈ వివాదానికి సంబంధించిన పలు అంశాలపై ఆయన వివరణ ఇచ్చారు. నామినేషన్ పత్రాల్లో అడిగిన ప్రతి కాలమ్‌ను అభ్యర్థులు తప్పనిసరిగా పూర్తి చేయాలని సీఈసీ తెలిపారు. చట్టసభలకు పోటీ చేసే అభ్యర్థులు ఏ చిన్న సమాచారాన్నైనా దాచిపెట్టినా లేదా ఖాళీగా వదిలినా నామినేషన్ చెల్లుబాటుపై ప్రభావం పడుతుందని హెచ్చరించారు. కొన్నిసార్లు రిటర్నింగ్ అధికారులు మానవీయ కోణంలో చిన్న తప్పులను పట్టించుకోకపోయినా.. రాజకీయ ప్రత్యర్థులు వాటిని అభ్యంతరంగా లేవనెత్తితే నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని పేర్కొన్నారు. మీనాక్షి నటరాజన్ విషయంలో తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసుకు సంబంధించిన వివరాలను అఫిడవిట్‌లో నమోదు చేసేందుకు రిటర్నింగ్ అధికారి తగిన అవకాశం ఇచ్చారని జ్ఞానేష్ కుమార్ తెలిపారు. అయితే ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోవడంతో రిటర్నింగ్ అధికారి స్వతంత్రంగా నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఒకసారి రిటర్నింగ్ అధికారి నిర్ణయం తీసుకున్న తర్వాత ఆ వ్యవహారంలో కేంద్ర ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకునే అవకాశం లేదని సీఈసీ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ, రిటర్నింగ్ అధికారి నిర్ణయాన్నే న్యాయస్థానం సమర్థించిందని ఆయన గుర్తు చేశారు.

# దేశంలోనే తొలి హైడ్రోజన్ రైలు ప్రారంభం

మొదటిపేజీ తరువాయి

అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జింద్ నుంచి సోనిపట్ స్టేషన్ల మధ్య ఉన్న సుమారు 89 కిలోమీటర్ల దూరాన్ని ఈ వినూత్న రైలు కేవలం రెండు గంటల వ్యవధిలోనే చేరుకుంటుందని అధికారులు వెల్లడించారు. ఈ ప్రయాణ మార్గంలో జింద్ సిటీ, పాండు పిండారా, లలిత్ ఖేడా, భంబేవా, ఇషాపుర్ ఖేరి, బుటానా, ఖంద్రాయ్, గోహానా, రథ్రా, లాత్, మోహనా, బర్వాస్ని సహా మొత్తం 12 స్టేషన్లలో ఈ రైలు ప్రయాణికుల కోసం ఆగుతుందని రైల్వే శాఖ స్పష్టం చేసింది.

ఈ అత్యాధునిక రైలు కేవలం పర్యావరణ హితమైనదే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో ఒక అరుదైన రికార్డును సైతం తన ఖాతాలో వేసుకుంది. ఏకంగా 3,200 హార్స్ పవర్ (హెచ్‌పీ) సామర్థ్యం గల అత్యంత శక్తివంతమైన హైడ్రోజన్ పవర్ ట్రైన్ ప్రొపల్షన్ వ్యవస్థతో నడిచే ఈ రైలుకు మొత్తం 10 భారీ బోగీలను (కోచ్‌లను) అమర్చారు. ప్రపంచంలోనే మరే దేశంలోనూ లేని విధంగా, ఇంతవరకు అందుబాటులో ఉన్న హైడ్రోజన్ రైళ్లన్నింటికంటే అతి పొడవైన ప్యాసింజర్ హైడ్రోజన్ రైలుగా ఇది అంతర్జాతీయ రికార్డు సృష్టించింది. ఈ ఒకే రైలులో ఒకేసారి ఏకంగా 2,600 మంది ప్రయాణికులు అత్యంత సౌకర్యవంతంగా ప్రయాణించవచ్చు.

ప్రస్తుతం మన దేశంలో విస్తృతంగా నడుస్తున్న సాంప్రదాయ విద్యుత్ రైళ్లు పైన ఉండే కరెంట్ తీగల (ఓవర్ హెడ్ వైర్లు) నుంచి విద్యుత్‌ను గ్రహించి నడుస్తాయి. అయితే, దానికి పూర్తిగా భిన్నంగా ఈ సరికొత్త రైలుకు ఎలాంటి బాహ్య విద్యుత్ తీగలతో అవసరం లేదు. ఇది విప్లవాత్మకమైన 'హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీ' సహాయంతో నడుస్తుంది. అంటే, ఈ రైలు తన ఇంజిన్ లోపలే హైడ్రోజన్‌ను విద్యుత్ శక్తిగా మార్చుకుని, సొంతంగా కరెంటును తయారు చేసుకుంటూ ముందుకు సాగుతుంది. ఈ రసాయన ప్రక్రియలో కేవలం ప్యూర్ నీటి ఆవిరి మాత్రమే ఉద్గారంగా బయటకు వస్తుంది కాబట్టి పర్యావరణానికి ఒక శాతం కూడా కాలుష్య ముప్పు ఉండదు.

పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో, మన దేశీయ ఇంజినీర్ల అద్భుత నైపుణ్యంతో రూపుదిద్దుకున్న ఈ హైడ్రోజన్ రైలు మేక్ ఇన్ ఇండియా సాధికారతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. పాతకాలపు డీజిల్ ఇంజిన్ల వల్ల విపరీతంగా వెలువడే ప్రమాదకర కార్బన్ ఉద్గారాలకు ఈ రైలు పూర్తిగా చెక్ పెట్టనుంది. అంతేకాకుండా, శిలాజ ఇంధనాల కొరత ఉన్న మన దేశంలో డీజిల్ కోసం విదేశాల నుంచి భారీగా దిగుమతులు చేసుకోవడానికి అయ్యే విదేశీ మారక ద్రవ్య భారం కూడా ఈ సాంకేతికత ద్వారా భవిష్యత్తులో క్రమంగా తగ్గుతుంది. సాధారణ డీజిల్ ఇంజన్లతో పోలిస్తే ఇది ప్రయాణ సమయంలో చాలా తక్కువ శబ్దం చేస్తూ ప్రయాణికులకు నిశ్శబ్ద వాతావరణాన్ని అందిస్తుంది.

రైలు ప్రారంభోత్సవం అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ సభను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఈ హైడ్రోజన్ రైలు ప్రారంభంతో అంతర్జాతీయ స్థాయిలో హరియాణా రాష్ట్ర పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. భారత రైల్వే ఆధునికీకరణ రూపురేఖలను మార్చడంలో ఇది ఒక చారిత్రాత్మక ముందడుగు అని కొనియాడారు. 2014వ సంవత్సరం వరకు దేశంలో రైల్వే లైన్ల విద్యుద్దీకరణ కేవలం 30 శాతం మాత్రమే ఉండేదని గుర్తు చేస్తూ, తమ ప్రభుత్వం వచ్చిన గత 12 ఏళ్ల పాలనా కాలంలో దానిని ఏకంగా 99 శాతానికి పెంచి రికార్డు సృష్టించామని వివరించారు. భవిష్యత్ అవసరాలను ముందే గుర్తించి, ముందుచూపుతోనే తమ ప్రభుత్వం రూ.14 వేల కోట్లతో రైల్వే, రోడ్డు మౌలిక వసతుల పనులను వేగంగా చేపడుతోందన్నారు.

ప్రయాణికుల రక్షణకు ఈ రైలులో అత్యున్నత ప్రాధాన్యతనిచ్చారు. ఇందులో అమర్చిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలు హైడ్రోజన్ గ్యాస్ లీకేజీ, ఓవర్ హీటింగ్, మంటలు లేదా పొగ వంటి ఎలాంటి అత్యవసర ప్రమాదకర పరిస్థితులు తలెత్తినా కేవలం సెకన్ల వ్యవధిలోనే గుర్తించి లోకో పైలట్‌ను అప్రమత్తం చేస్తాయి. ఒకవేళ ఎక్కడైనా లీకేజీ జరిగితే, గాలి ఎప్పటికప్పుడు బయటకు వెళ్లేలా డిజైన్ చేసిన ప్రత్యేక వెంటిలేషన్ వ్యవస్థ ఆ గ్యాస్‌ను గాల్లోకి పంపి పలుచబడేలా చేస్తుంది. ఒకవేళ ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉంటే, రైలులోని 'ఆటోమేటిక్ షట్‌ఆఫ్' వ్యవస్థ క్షణాల మీద తనంతట తానుగా హైడ్రోజన్ ఇంధన సరఫరాను పూర్తిగా నిలిపివేసి పెద్ద ప్రమాదాలు జరగకుండా కాపాడుతుంది.

ఈ నూతన హైడ్రోజన్ ప్యాసింజర్ రైలు వారంలో ఆదివారం మినహా మిగిలిన ఆరు రోజులు ప్రయాణికులకు నిరంతరాయంగా అందుబాటులో ఉంటుందని రైల్వే ఉన్నతాధికారులు ప్రకటించారు. రైలును ఎల్లప్పుడూ సురక్షితమైన స్థితిలో ఉంచేందుకు వీలుగా ప్రతి ఆదివారం దీనికి ప్రత్యేక షెడ్యూల్డ్ నిర్వహణ పనులు మరియు కఠినమైన సాంకేతిక తనిఖీలను నిర్వహిస్తారు. ఇందుకోసం ప్రతి శనివారం రాత్రి ఈ రైలును ఢిల్లీలోని ప్రసిద్ధ 'షకుర్‌బస్తి వర్క్‌షాప్'నకు తరలిస్తామని, అక్కడ నిపుణులైన ఇంజినీర్ల బృందం పూర్తి తనిఖీలు పూర్తి చేసిన తర్వాతే సోమవారం ఉదయం తిరిగి హరియాణాలో ప్రయాణికుల సేవలకు పునరుద్ధరిస్తామని అధికారులు స్పష్టం చేశారు.



3

DD9 వార్త
తెలుగు దినపత్రిక

DD9 Vaartha

శనివారం
18-07-2026
హైదరాబాద్

## సర్ సర్వేను 100%పూర్తి చేసిన చించొల్లి గ్రామ బీఎల్వో కు అభినందించిన ఆర్డీవో రవీందర్ రెడ్డి.

**బాన్సువాడ, జూలై 17(డిడి9 వార్త):**

బీర్కూర్ మండలంలోని చించొల్లి గ్రామంలో ప్రత్యేక ఇంటింటి సర్వే (సర్) ను 100 శాతం విజయవంతంగా పూర్తి చేసిన గ్రామ బీఎల్వో మంజుల ని బాన్సువాడ ఆర్డీవో రవీందర్ రెడ్డి అభినందించారు.విధి నిర్వహణలో అంకితభావం, నిబద్ధతతో పనిచేసి సర్వేను నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా పూర్తిచేసినందుకు మంజులని ప్రశంసించారు.ఇదే సేవా స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని ఆర్డీవో సూచించారు.ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది మంజుల కి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆమె కృషి ఇతర బీఎల్వోలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని కొనియాడారు.ఈకార్యక్రమంలో తహశీల్దార్ సవాయిసింగ్,బీర్కూర్ సర్పంచ్ ధర్మతేజ,ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డి,సీనియర్ అసిస్టెంట్ జ్యోతి ఉన్నారు.



# ధరణి లావాదేవీలపై సిట్ దర్యాప్తు..

**మొదటిపేజీ తరువాయి**

విజిలెన్స్, పోలీసు తదితర శాఖల అధికారులు, భూ వ్యవహారాల నిపుణులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయనున్నారు.
ధరణి వ్యవస్థపై గత కొంతకాలంగా వస్తున్న ఫిర్యాదులు, భూ యాజమాన్య వివాదాలు, అక్రమ రిజిస్ట్రేషన్లు, రికార్డుల్లో మార్పులు వంటి ఆరోపణలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. విచారణలో బయటపడే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం.
అదే సమయంలో గ్రామ పంచాయతీల ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేసే దిశగా కూడా కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామ పంచాయతీలకు వివిధ మార్గాల ద్వారా వచ్చే సొంత ఆదాయాన్ని నేరుగా ఆయా పంచాయతీల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేయాలని ఆమోదం తెలిపింది. దీంతో స్థానిక సంస్థలకు ఆర్థిక స్వయం ప్రతిపత్తి పెరగడంతో పాటు నిధుల వినియోగంలో పారదర్శకత మరింత మెరుగుపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.
పంచాయతీల ఆదాయంపై స్థానిక సంస్థలకే పూర్తి నియంత్రణ ఉండేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. గ్రామీణాభివృద్ధి పనులను వేగవంతం చేయడం, స్థానిక అవసరాలకు అనుగుణంగా నిధులను వినియోగించే అవకాశం కల్పించడం ఈ నిర్ణయంతో సాధ్యమవుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.



మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ శాఖలకు సంబంధించిన అంశాలపై కూడా విస్తృతంగా చర్చ జరిగినట్లు తెలిసింది. సమావేశంలో తీసుకున్న ఇతర నిర్ణయాలకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వం అధికారిక ప్రకటన ద్వారా వెల్లడించే అవకాశం ఉంది.

## పిల్లల మధ్య అంతరం ఉంటేనే కుటుంబాలు ఆరోగ్యం

- **అదనపు కలెక్టర్ భుజంగారావు**

**నిజామాబాద్ జిల్లా జూలై 17(డీడీ9 వార్త):**

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలోని మాలపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అవగాహన ర్యాలీని ఘనంగా నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ భుజంగారావు ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీలో పాల్గొన్న వారు చిన్న కుటుంబం చింతలు లేని కుటుంబం, హమ్ దో హమారే దో వంటి నినాదాలు చేస్తూ పరిసరాల్లో అవగాహన కల్పించారు. పెరుగుతున్న జనాభా వల్ల వనరులు తగ్గి కుటుంబ పోషణ భారం పెరగడమే కాకుండా వాతావరణ కాలుష్యం, అపరిశుభ్రత వంటి సమస్యలు తలెత్తుతాయని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. ఆసుపత్రి ముందు మానవహారం నిర్వహించి కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటించడం ద్వారానే మెరుగైన జీవనం సాధ్యమని సందేశాన్ని చాటి చెప్పారు. ర్యాలీ అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రాజశ్రీ మాట్లాడుతూ...పిల్లల మధ్య సరైన అంతరం ఉన్నప్పుడే కుటుంబాలు ఆరోగ్యంగా, నైపుణ్యంతో ఉంటాయని పేర్కొన్నారు. అర్హులైన కుటుంబాలు తాత్కాలిక (పిపిఐయుసిడి, ఐయుసిడి, అంతర ఇంజక్షన్, ఓరల్ పిల్స్) మరియు శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటించాలని సూచించారు. కుటుంబ నియంత్రణ అంటే కేవలం మహిళల బాధ్యత మాత్రమే కాదని, ఇందులో పురుషుల భాగస్వామ్యం కూడా అవసరమని డాక్టర్ రాజశ్రీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కుటుంబ నియంత్రణ సంక్షేమ కార్యక్రమాల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిజిహెచ్ గైనకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీప్రసన్న, డాక్టర్ అరుణ రేఖ, డిఐఓ డాక్టర్ అశోక్, జిల్లా ఉప వైద్యాధికారులు, ఇతర అధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.





## కల్దుర్కిలో వర్షాల కోసం గంగమ్మకు జలాభిషేకం

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూలై 17(డీడీ9 వార్త):**

వానలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని, రైతులు, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ కల్దుర్కి గ్రామస్తులు ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలోని ప్రజలందరూ కలిసి కందకుర్తిలోని పవిత్ర త్రివేణి సంగమం వద్దకు చేరుకుని, అక్కడ గంగాజలాలను సేకరించారు. ఆ పవిత్ర జలాలను గ్రామానికి తీసుకొచ్చి, ఇక్కడి గ్రామ దేవతలకు ఘనంగా జలాభిషేకం నిర్వహించారు. వర్షాల కోసం గంగా మాతను భక్తిపూర్వకంగా వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నరేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ జ్యోతి శంకర్, వీడీసీ చైర్మన్ గంగాధర్, తుడం బాబు, వార్డు మెంబర్లు చంద్రకాంత్, మల్లుగొండ, అశోక్, హన్మండ్లు, నాగు, గ్రామ పెద్దలు రాజన్న, మొగులయ్య, లక్ష్మణ్, గౌర్ గోండా, చందయ్య, సుధాకర్, యువకులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు

## బోధన్ లో వైభవంగా జగన్నాథుని రథయాత్ర

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూలై 17(డీడీ9 వార్త):**

భక్తి భావం.. భజనల హోరు.. హరి నామస్మరణతో బోధన్ పట్టణం శుక్రవారం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. సేవకుంజ్ భక్త బృందం ఆధ్వర్యంలో శ్రీ జగన్నాథ స్వామి రథయాత్ర అత్యంత వైభవంగా సాగింది. వరుసగా ఆరో ఏడాది కూడా ఈ వేడుకను ఘనంగా నిర్వహించడంతో పట్టణ వీధులన్నీ 'హరి నామస్మరణ'తో మార్మోగిపోయాయి. ఈ రథయాత్రను బోధన్ మున్సిపల్ చైర్మన్ తూము పద్మశరత్ రెడ్డి ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి, స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపి రథాన్ని ప్రారంభించి యాత్రను ముందుకు నడిపించారు. రాకాసిపేట్ సేవకుంజ్ నుంచి ప్రారంభమై అంబేద్కర్ చౌరస్తా, పెద్ద హనుమాన్ మందిరం, కొత్త బస్టాండ్ మీదుగా సాగిన రథయాత్రలో భక్తులు ప్రతి అడుగులోనూ హరి నామస్మరణ చేస్తూ ముందుకు సాగారు. ఈ వేడుకలో హెచ్.జి. జనసీవాస్ దాస్ ప్రభుజీ ఆలపించిన హరికథ గానం భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తగా, హెచ్.జి. గౌర్ గోపాల్ దాస్ అధికారి నేతృత్వంలో సాగిన హరినామ సంకీర్తనలు భక్తులను పరవశింపజేశాయి. రథం వెళ్తున్న మార్గమంతా భక్తులు స్వామివారికి నీరాజనాలు పలుకుతూ భక్తిని చాటుకున్నారు.
మహా ప్రసాద వితరణ టిటిడి కళ్యాణ మండపం వద్దకు రథయాత్ర చేరుకోవడంతో వేడుకలు ముగిశాయి. అనంతరం నిర్వాహకులు భక్తులందరికీ స్వామివారి మహా అన్నప్రసాదాన్ని అందజేశారు. పట్టణ సీఐ వెంకట నారాయణ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సేవకుంజ్ భక్త బృందం ప్రతినిధులు విటల్ ప్రభు, వైశాలి మాతాజీ, శ్రీరామ్ ప్రభు, రవి ప్రభు, శ్యామ్ ప్రభు, మాధవి మాతాజీ, వాణి మాతాజీ, శాంతి మాతాజీలు, మహిళా భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.



## నిజామాబాద్‌లో దారుణ హత్యకు పాల్పడిన నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష

**నిజామాబాద్ జిల్లా జూలై 17(డీడీ9 వార్త):**

మెండోరా పోలీస్ స్టేషన్ పరిధిలోని దూద్‌గావ్ గ్రామంలో చోటుచేసుకున్న హత్య కేసులో నిందితుడికి కోర్టు పదేళ్ల కఠిన కారాగార శిక్షను ఖరారు చేసింది. నిజామాబాద్ 1వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు ఈ మేరకు తీర్పు వెలువరించినట్లు పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య శుక్రవారం మీడియాకు వెల్లడించారు. కేసు వివరాల్లోకి వెళ్తే.. దూద్‌గావ్ గ్రామానికి చెందిన భాగ్యవతి, నిందితుడు బుచ్చన్న నివాసాలు ఎదురెదురుగా ఉంటాయి. వారి ఇళ్ల మధ్య ఉన్న వేప చెట్టు విషయంలో గత నాలుగేళ్లుగా వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో 2022, జూన్ 2న ఉదయం 9 గంటల సమయంలో నిందితుడు బుచ్చన్న, ఫిర్యాది కుమారుడు వసంత్‌తో గొడవకు దిగాడు. ఈ క్రమంలో బుచ్చన్న, వసంత్ తలను పట్టుకుని గోడకు మూడుసార్లు బలంగా కొట్టడంతో వసంత్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స పొందుతూ బాధితుడు మరణించడంతో బంధువులు మెండోరా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. అప్పటి సీఐ గోవర్ధన్ రెడ్డి నిందితుడిని అరెస్టు చేసి, పక్కా సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యాలను, వాంగ్మూలాలను పరిశీలించిన 1వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శ్రీమతి హరీష, నేరం రుజువు కావడంతో నిందితుడు బుచ్చన్నకు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు పదివేల రూపాయల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలల జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా వాదనలు వినిపించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.నర్సింహా రెడ్డిని, దర్యాప్తులో కీలక పాత్ర పోషించిన అప్పటి ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్ రెడ్డి, ప్రస్తుత సీఐ జాన్ రెడ్డి, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ గోవింద్, ఏఎస్ఐ మురళి ధర్ రాజు, కానిస్టేబుళ్లు విషన్ గౌడ్, లక్ష్మణ్, రాజులను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య ప్రత్యేకంగా అభినందించారు.

## కమ్మర్‌పల్లిలో మొక్కలు నాటిన కేబీఏ ప్రతినిధులు

**నిజామాబాద్ జిల్లా జూలై 17(డీడీ9 వార్త):**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా కమ్మర్‌పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ (కేబీఏ) ఆధ్వర్యంలో అసోసియేషన్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేబీఏ అధ్యక్షుడు లుక్క గంగాధర్ మాట్లాడుతూ.. నేడు నాటిన ప్రతి మొక్క భవిష్యత్తు తరాలకు వరంగా మారుతుందని పేర్కొన్నారు.
చెట్లు నాటడం ద్వారా సకాలంలో వర్షాలు కురవడమే కాకుండా, వాతావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుందని తెలిపారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు భోగ శ్యామ్, కార్యదర్శి చిలువేరి పవన్ కుమార్, సలహాదారుడు పెంట కిషన్, సభ్యులు చింత ప్రదీప్, ఉద్యోగ గంగాధర్, చంద్రశేఖర్, చింత తిరుపతి, శ్రీపాద రాహుల్, చింత నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు



## వైద్యసేవల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

- **ఆసుపత్రి తనిఖీలో కలెక్టర్ అసహనం**
- **పారిశుధ్య ఏజెన్సీకి నోటీసు**
- **మౌలిక సదుపాయాలకు నిధుల మంజూరు**

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూలై 17(డీడీ9 వార్త):**

ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని, పనితీరులో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. శుక్రవారం ఆమె బోధన్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ విభాగం, కాన్పుల గది, వార్డులను పరిశీలించి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ఆవరణ, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న కాంట్రాక్టు ఏజెన్సీకి వెంటనే షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. మార్పు రాకపోతే కాంట్రాక్టును రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ఆసుపత్రి అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. బాన్సువాడ, సరిహద్దు ప్రాంతాల నుంచి వస్తున్న గర్భిణీల కోసం 'బర్త్ వెయిటింగ్ రూమ్' ఏర్పాటు చేయాలని, భద్రత కోసం 'పోలీస్ అవుట్ పోస్ట్' ప్రతిపాదనలను పోలీసు శాఖకు పంపుతామని తెలిపారు. ఆసుపత్రి నిర్వహణపై ప్రతి పక్షం రోజులకు ఒకసారి ఆర్డీఓ నేతృత్వంలో సమీక్షా సమావేశం నిర్వహించి తనకు నివేదిక అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐఐహెచ్ఎఫ్ డబ్ల్యూ చైర్‌పర్సన్ డాక్టర్ కవితా రెడ్డి, ఆర్డీఓ విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.



## హసకొత్తూరు కాంగ్రెస్ గ్రామ శాఖ నూతన కమిటీ ఎన్నిక

**నిజామాబాద్ జిల్లా జూలై 17(డీడీ9 వార్త):**

కమ్మర్‌పల్లి మండలంలోని హసకొత్తూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు ఎడ్ల శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగం సభ్యుల సమక్షంలో జరిగిన ఈ ఎన్నికల్లో నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. గ్రామ శాఖ ఉపాధ్యక్షులుగా చిన్నవేళ శ్రీనివాస్, సెక్రటరీగా ఎదుల రాజు, కోశాధికారిగా రాదారపు సాయన్న, కార్యదర్శిగా అలకుంట శేఖర్ నియమితులయ్యారు. అలాగే ప్రధాన సలహాదారులుగా సి.హెచ్. గంగాధర్, మేడం రమేష్, కనుక గంగన్నలను ఎంపిక చేశారు.
ఈ సందర్భంగా ఎడ్ల శ్రీకాంత్ మాట్లాడుతూ.... నూతనంగా ఎన్నికైన వారందరికీ అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతి కార్యకర్త క్రియాశీలకంగా వ్యవహరించాలని, గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరం సమన్వయంతో కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోనగిరి భాస్కర్, గ్రామ సర్పంచ్ రేవతి గంగాధర్, ఉప సర్పంచ్ మనోహర్, జిల్లా కిసాన్ ఖేత్ ఉపాధ్యక్షులు పడిగేల ప్రవీణ్, జిల్లా నాయకులు దేవేందర్, మండల నాయకులు శ్రీనివాస్, మురళి, బుచ్చిమల్లయ్య, లింగారెడ్డి, కుందేటి శ్రీనివాస్, మహేందర్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ షాక్‌తో మేకల కాపరి మృతి

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూలై 17(డీడీ9 వార్త):**

విద్యుత్ షాక్‌కు గురై మేకల కాపరి మృతి చెందిన ఘటన బోధన్ మండలం కల్దుర్కి గ్రామ శివారులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కల్దుర్కి గ్రామానికి చెందిన ఎన్నోల సాయిలు అనే వ్యక్తి శుక్రవారం మేకలను మేపుకునేందుకు సాయంత్రం గ్రామ శివారుకు వెళ్లాడు. అదే గ్రామానికి చెందిన కబాలి ప్రకాష్ వ్యవసాయ పొలం గట్టుపై నడుచుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారింది. ఈ క్రమంలో సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు చేయి తగలడంతో తీవ్ర విద్యుత్ ఘాతానికి గురై సాయిలు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

# ప్రభుత్వ పథకాల అమలులో సమన్వయంతో పనిచేయాలి: ఎంపీ సురేష్ షెట్కర్

- దిశా సమావేశంలో జిల్లా అభివృద్ధి పనులపై సమగ్ర సమీక్ష

**కామారెడ్డి బ్యూరో, జూలై 17(డిడి9 వార్త):**




ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు, జిల్లా దిశా కమిటీ చైర్మన్ సురేష్ షెట్కర్ అన్నారు.శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా దిశా కమిటీ సమావేశంలో ఎంపీ సురేష్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సకాలంలో అందించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.వ్యవసాయం, నీటిపారుదల, రహదారులు, రహదారి భద్రత, బ్యాంకింగ్, విద్య, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించి, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రైతులకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత అవగాహన కల్పించి, కిసాన్ క్రెడిట్ కార్డులు, పంట బీమా తదితర పథకాల అమలును మరింత వేగవంతం చేయాలని పేర్కొన్నారు.జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా చర్యలను పటిష్టం చేయాలని, తాగునీరు, సాగునీటి సౌకర్యాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి అందుబాటులో ఉన్న నిధులను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులకు ఆరుతడి పంటల సాగుపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఉపాధి హామీ పథకం పనులను క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రతి అర్హుడికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు సంబంధిత శాఖలు చొరవ చూపాలని కోరారు.జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ సమావేశంలో సభ్యులు చేసిన సూచనలను కార్యాచరణ ప్రణాళికతో అమలు చేయాలని, శాఖల మధ్య సమన్వయాన్ని పెంచి అభివృద్ధి కార్యక్రమాలను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, అదనపు కలెక్టర్లు విక్టర్, ఎన్.వి. గిరి, డీఆర్‌డీఏ పీడీ దామోదర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూలై 17(డీడీ9 వార్త):**

మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తికి కోర్టు రెండు రోజుల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చినట్లు బోధన్ రూరల్ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగ మద్యం మత్తులో వాహనం నడుపుతున్న వ్యక్తి పట్టుబడ్డాడు. అతడిని అదుపులోకి తీసుకుని బోధన్ కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం ఈ మేరకు తీర్పు ఇచ్చిందని ఎస్సై పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమని, నిబంధనలను పాటించాలని ఆయన సూచించారు.

# కాలువ నిర్మాణ పనులకు భూమి పూజ

**అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం( డి డి 9 వార్త) జులై 17**

తలమడుగు మండలం. ఝరి గ్రామ పంచాయితీ పరిధిలో.శేకుగూడ గ్రామంలో NREGS నిధులు. ఐదు లక్షల రూపాయలతో. కాలువ నిర్మాణ పనులకు. స్థానిక సర్పంచ్ మేస్రం రూప కాశీరాం లతో. కలిసి భూమి పూజ చేసిన. మాజీ ఎంపీ సోయం బాపూరావు. అతను మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం. ప్రజా సంక్షేమానికి కట్టుబడి పని చేస్తుందని అన్నారు. గ్రామాలలో అర్హులైన నిరుపేదలకు. ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తున్నామన్నారు. గ్రామంలో ఏ సమస్య ఉన్న. తన దృష్టికి తీసుకువస్తే. సమస్యను. ముఖ్యమంత్రి.రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లి. పరిష్కార మార్గం. చూపిస్తానన్నారు. జరి గ్రామంలో. నాయకులతో కలిసి. అభివృద్ధి పనులకు. భూమి పూజ చేయడం సంతోషంగా ఉందన్నారు. త్వరలో. మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు కూడా. భూమి పూజ చేయడానికి జేరి గ్రామానికి వస్తానన్నారు ఆదివాసీలు మరియు బడుగు బలహీన వర్గాల సంక్షేమం. కాంగ్రెస్ ప్రభుత్వం. ముఖ్యమంత్రి. రేవంత్ రెడ్డి తోని సాధ్యమన్నారు.

ఈ కార్యక్రమంలో. మార్కెట్ కమిటీ చైర్మన్. బోరంచు శ్రీకాంత్ రెడ్డి. మాజీ డిసిసిబి చైర్మన్. అడ్డి బోజారెడ్డి. మాజీ జెడ్పిటిసి. గోక గణేష్ రెడ్డి బొల్లారం బాబన్న. కళ్యాణం రాజేశ్వర్. మాజీ వైస్ ఎంపీపీ. పెందుర్తి దివ్య మాధవ్. జైతు పటేల్. మోహన్ రెడ్డి. బూరుగు రాజు పున్నగూడ సర్పంచ్ హనుమంతు. గోడం సంబు మరియు. స్థానిక నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.



# భిక్నూర్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు.. పాడైన ఆహారం ధ్వంసం

**కామారెడ్డి బ్యూరో, జూలై 17(డిడి9 వార్త):**



ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ జి. విక్రమ్ శుక్రవారం గార్గుల్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. భోజనం తయారీ సమయంలో పరిశుభ్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత వంట సిబ్బందికి సూచించారు.

అనంతరం భిక్నూర్ పట్టణంలోని పలు ధాబాలు, హోటళ్లు, రెస్టారెంట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచిన పాడైన ఆహార పదార్థాలను గుర్తించి ధ్వంసం చేయించారు. హోటల్, రెస్టారెంట్ యజమానులు పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, సరైన పెస్ట్ మేనేజ్‌మెంట్ చర్యలు చేపట్టాలని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సూచించారు. అలాగే ప్రతి ఫుడ్ బిజినెస్ ఆపరేటర్ తప్పనిసరిగా ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ కలిగి ఉండాలని, లైసెన్స్ లేని వారు వెంటనే పొందాలని ఆదేశించారు.ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందించడమే ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశమని ఫుడ్ సేఫ్టీ అధికారులు తెలిపారు.

# అంగన్‌వాడీ కేంద్రానికి 15 కుర్చీలు విరాళంగా అందజేసిన బీజేపీ కార్యకర్త పుల్కాటి మల్లేష్

**బాన్సువాడ, జూలై 17(డిడి9 వార్త):**

బీర్కూర్ మండలంలోని బరంగేడ్గి గ్రామ అంగన్‌వాడీ కేంద్రానికి చిన్నారుల సౌకర్యార్థం 15 కుర్చీలను బీజేపీ కార్యకర్త పుల్కాటి మల్లేష్ విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా గ్రామంలోని చిన్నారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ సహాయం చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు నాగెల్ల సాయికిరణ్, మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు చి. రమేష్, బీజేపీ కార్యకర్తలు శ్రీకాంత్, గణేష్ తదితరులు పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి అవసరమైన సామగ్రిని అందించిన పుల్కాటి మల్లేష్‌కు అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.





# బాన్సువాడలో బంగారు గొలుసు దోపిడీ కేసు ఛేదన.. 24 గంటల్లో నిందితుడి అరెస్ట్

**బాన్సువాడ, జూలై 17 (డిడి9 వార్త):**

బాన్సువాడ పట్టణంలోని శాంతినగర్ కాలనీలో జరిగిన బంగారు గొలుసు దోపిడీ కేసును బాన్సువాడ పోలీసులు కేవలం 24 గంటల్లోనే ఛేదించి నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి సుమారు 23 గ్రాముల బంగారు గొలుసు, నేరానికి ఉపయోగించిన మోటార్‌సైకిల్ మరియు మొబైల్ ఫోన్ను స్వాధీనం చేసుకున్నారు.డీఎస్పీ విట్టల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జూలై 15 రాత్రి సుమారు 8 గంటల సమయంలో శాంతినగర్ కాలనీకి చెందిన బెజిగం రమేష్ ఇంటికి వెళ్లిన నిందితుడు తాను ఎక్సైజ్ శాఖ అధికారినని నమ్మించి, కిరాణా దుకాణంలో మద్యం సీసాలు విక్రయిస్తున్నారనే సమాచారం వచ్చిందంటూ తనిఖీ నిర్వహించాడు. అనంతరం రమేష్ నీళ్లు తాగేందుకు ఇంట్లోకి వెళ్లిన సమయంలో అతనిపై దాడి చేసి కిందపడవేసి, మెడలో ఉన్న సుమారు రెండు తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. ఫిర్యాదు అందుకున్న వెంటనే బాన్సువాడ టౌన్ సీఐ తుల శ్రీధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో నిందితుడు బత్తుల మునీశ్వర్ (24), దుర్కి గ్రామానికి చెందిన బ్రాంచ్ పోస్టుమాస్టర్గా గుర్తించారు.దర్యాప్తులో నిందితుడు క్రికెట్ బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ గేమింగ్‌లకు బానిసై పోస్టాఫీసుకు చెందిన సుమారు రూ.12 లక్షల ప్రభుత్వ నిధులను బెట్టింగ్‌లలో కోల్పోయినట్లు వెల్లడైంది. శాఖాపరమైన విచారణ అనంతరం కొంత మొత్తాన్ని తిరిగి చెల్లించినప్పటికీ ఇంకా రూ.42 వేల బకాయి ఉండటంతో విధుల నుంచి సస్పెండ్ అయ్యాడని, బెట్టింగ్ కోసం డబ్బు సమకూర్చుకునే ఉద్దేశంతో ఈ దోపిడీకి పాల్పడినట్లు విచారణలో అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.సమాచారం మేరకు పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, దొంగిలించిన బంగారు గొలుసుతో పాటు మోటార్‌సైకిల్, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

ఈ కేసును 24 గంటల్లో ఛేదించిన ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ క్రైమ్ టీమ్ హెడ్ కానిస్టేబుల్ సాయికుమార్, కానిస్టేబుళ్లు పాండురంగ, సుదర్శన్ రావు, పృథ్వీరాజ్లను ఉన్నతాధికారులు అభినందించారు. ప్రభుత్వ అధికారులమని చెప్పి ఇళ్లలోకి లేదా వ్యాపార సంస్థల్లోకి వచ్చే వ్యక్తుల గుర్తింపు వివరాలను తప్పనిసరిగా ధృవీకరించిన తర్వాతే సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని బాన్సువాడ డీఎస్పీ విట్టల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# వరి పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన రైతు మృతి

**బాన్సువాడ, జూలై 17(డిడి9 వార్త):**

బాన్సువాడ పట్టణ శివారులో వరి పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన రైతు ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన విషాదాన్ని నింపింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత బాన్సువాడ శాంతినగర్ కాలనీకి చెందిన దేశాయిపేట్ నారాయణ (45) గురువారం రాత్రి ఇంట్లో భోజనం చేసిన అనంతరం గ్రామ శివారులో తాను కౌలుకు సాగు చేస్తున్న గురు సిద్ధయ్య పొలానికి వరి పంటకు నీరు పారించేందుకు వెళ్తున్నట్లు తన భార్య సుజాతకు చెప్పి బయలుదేరాడు. అయితే శుక్రవారం ఉదయం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన భార్య సుజాత గురు సిద్ధయ్య పొలం వద్దకు వెళ్లి వెతకగా, గురు సిద్ధయ్య, గాండ్ల గంగారం పొలాల మధ్య ఉన్న మట్టి రహదారిపై నారాయణ మృతదేహం బోర్లా పడి కనిపించింది.మృతుడి భార్య తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి కురిసిన వర్షంతో నల్లరేగడి మట్టి రహదారి బురదగా మారడంతో నారాయణ కాలు జారి పడిపోయి, బురద నీటిలో శ్వాస ఆడక మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




# వర్షాల కోసం కప్పతల్లి ఆట

**అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం( డి డి 9 వార్త)జులై 17**

తలమడుగు మండలం బరంపూర్ గ్రామంలో గ్రామస్తులు కప్పతల్లి ఆట ఆడారు. వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని. రైతులు గ్రామస్తులు చిన్న పెద్ద అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటూ. గ్రామంలో ప్రధాన వీధుల గుండా. ఒకదికొకరు నీళ్లు పోసుకుంటూ ఆనందోత్సవాలతో. కార్యక్రమం నిర్వహించారు. తరతరాలుగా వస్తున్న ఈ ఆడవాయితీని. గ్రామస్తులందరూ. ఐక్యమత్యంతో. నిర్వహించారు ఈ కార్యక్రమంలో రమకాంత్. బండారి. దినేష్ మరియు.యువకులు పాల్గొన్నారు



# విద్యార్థులకు పురుగుల అన్నం... నీళ్ల చారు

- విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం...
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విద్యాశాఖ అధికారులు
- పురుగుల అన్నంపై గ్రామ సర్పంచ్ సునీత ఆగ్రహం



**నిజామాబాద్ రుద్రూర్, జూలై 17 (డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో పురుగులు కనిపించడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహిస్తున్న ఏజెన్సీ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులకు నాణ్యతలేని ఆహారం అందిస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. శుక్రవారం గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్, ఉపసర్పంచ్ నిస్సార్, ఎంపీడీఓ బాల గంగాధర్, ఎంపీఓ అరవింద్, గ్రామ కార్యదర్శి ప్రేమ్ దాస్‌లతో కలిసి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బియ్యం బస్తాల్లోనే కాకుండా వండిన అన్నంలో కూడా పురుగులు కనిపించడంతో వారు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వంటకు వినియోగించిన బియ్యం పూర్తిగా పురుగులమయంగా ఉండటంతో మధ్యాహ్న భోజనం నాణ్యతపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

విద్యార్థులు మాట్లాడుతూ, వారానికి మూడు సార్లు గుడ్లు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ వాటిని అందించడం లేదని, పప్పుచారు కూడా నీళ్లలా పలుచగా ఉంటోందని సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. మధ్యాహ్న భోజనంలో పురుగులు, నాణ్యతలేని ఆహారం అందిస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, మధ్యాహ్న భోజనం నాణ్యతపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# కోటగిరి ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజనీర్‌గా జి. రవికుమార్ బాధ్యతల స్వీకరణ

**నిజామాబాద్ కోటగిరి,/ జూలై 17 /(డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలంలోని ఇరిగేషన్ శాఖ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)గా జి. రవికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

కరీంనగర్ నుంచి బదిలీపై కోటగిరికి వచ్చిన ఆయన, కోటగిరి ఇరిగేషన్ సబ్‌డివిజన్ నెం. 3 అసిస్టెంట్ ఇంజనీర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సంబంధిత ఇరిగేషన్ డివిజనల్ ఇంజనీర్ (డీఈ)కు జాయినింగ్ లేఖను అందజేశారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన జి. రవికుమార్‌కు శాఖ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, అభివృద్ధి పనులను సమర్థవంతంగా చేపట్టేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నట్లు తెలిసింది.



# రేపు పెద్దపల్లి జిల్లా లో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కమిషన్ బృందం సమీక్ష సమావేశం.

**డిడి9వార్త / రామగుండం జులై 18:**

శనివారం నాడు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అలాగే సభ్యులు కొంకటి లక్ష్మీ నారాయణ మరియు మిగతా సభ్యులు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ తో కలెక్టరేట్లోఉదయం 10.30 గంటలకు సమీక్ష సమావేశం లో పాల్గొంటారు.ఈ సమావేశంలో జిల్లాలో నమోదైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తు, ఎస్సీ ఎస్టీ కార్మికులు ఎదుర్కుంటున్న సమస్యలు మరియు ఎస్సీ ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన భూ బాధితులు వారికి జరిగిన అన్యాయాలు, పరిశీలన అలాగే బ్యాక్ లాగ్ పోస్టులకు సంబంధించి తదితర అంశాలపై పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీహర్ష మరియు సంబంధిత ఉన్నత అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా టి.ఏం ఆర్ పి ఎస్,పెద్దపల్లి జిల్లా అధ్యకుడు యాసర్ల రాజకుమార్ (తిమోతి) మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఎస్సీ ఎస్టీ సామాజిక వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు మరియు బాధితులు రాష్ట్ర ఎస్సీ కమిషన్ ద్వారా వారి సమస్యలు పరిష్కరించుకోగలరని తెలియజేశారు.




# తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ముల్కాల మోహన్‌రావుకు వ్యాల్ల హరీష్ రెడ్డి ఆర్థిక సహాయం.

**డిడి9వార్త / రామగుండం జులై 18:**

గోదావరిఖని విజయనగర్ ప్రాంతానికి చెందిన ముల్కాల మోహన్‌రావు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ, చికిత్స మరియు మందుల ఖర్చులకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకుడు కడమండ్ల శ్రీహరి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు.ఈ విషయంపై వెంటనే స్పందించిన వ్యాల్ల హరీష్ రెడ్డి , మోహన్‌రావు చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని తమ అనుచరుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ముల్కాల మోహన్‌రావు త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు.ఆర్థిక సహాయం అందించినందుకు ముల్కాల మోహన్‌రావు కుటుంబ సభ్యులు వ్యాల్ల హరీష్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అవసర సమయంలో స్పందించి అండగా నిలవడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు.



# పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్న ప్రజా ప్రతినిధులు..



- **సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన.**

**మణుగూరు. జూలై 17(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలం లోని,సమితిసింగారం గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం నాడు పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులను నిర్వహించారు. గ్రామపంచాయతీ పరిధి లోని 5 వ వార్డులో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల మరియు డిగ్రీ కళాశాల పరిసర ప్రాంతాలలో గల పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు డ్రైనేజీలను శుభ్రం చేయించారు. సమితి సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, 5వ వార్డు సభ్యులు శ్రీమతి కోలపిన్ని మానస తదితరులు దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలోగల ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసర ప్రాంతాలలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఎస్కే షబానా మరియు పంచాయతీ కార్యదర్శి జక్కుల అశోక్, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







# చౌట్‌పల్లిలో కన్నుల పండువగా జగన్నాథుని రథయాత్ర

- **హరేకృష్ణ నామస్మరణతో మార్మోగిన వీధులు**
- **భక్తిపారవశ్యంలో మునిగిపోయిన భక్తజనం**

**నిజామాబాద్ జిల్లా, జూలై 17(డీడీ9 వార్తా) :**

కమ్మర్ పల్లి మండలం చౌట్‌పల్లిలో ఇస్కాన్ ఆర్మూర్ ఆధ్వర్యంలో శ్రీ జగన్నాథుని రథయాత్ర అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో కన్నుల పండువగా సాగింది. హరేకృష్ణ నామస్మరణతో చౌట్‌పల్లి వీధులన్నీ మారుమోగిపోగా, భక్తజన కోలాహలం మధ్య రథయాత్ర సాగింది. మధ్యాహ్నం 3 గంటలకు చౌట్‌పల్లి బస్టాండ్ వద్ద చౌట్‌పల్లి సర్పంచ్ మహబూబ్, బషీరాబాద్ సర్పంచ్ జమున మహేష్ సంయుక్తంగా రథయాత్రను ప్రారంభించారు. అక్కడి నుంచి ప్రారంభమైన రథయాత్ర బషీరాబాద్ వివేకానంద చౌరస్తా, పోచమ్మ మందిరం మీదుగా పెద్దమ్మ తల్లి కళ్యాణ మండపం వరకు కొనసాగింది. రథేచ వామనం దృష్ట్వా పునర్జన్మ నవిద్యతే అన్న సూక్తిని స్ఫూర్తిగా తీసుకుని, తమ ఇలవేల్పు జగన్నాథుడిని దర్శించుకుని భక్తులు పునీతులయ్యారు. మార్గమధ్యంలో జరిగిన భజనలు, కీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆధ్యాత్మిక లోకంలోకి తీసుకెళ్లాయి. రథయాత్ర సాగుతున్నంత సేపు ఆధ్యాత్మిక ప్రవచనాలతో వాతావరణం భక్తిభరితంగా మారింది. చివరగా పెద్దమ్మ తల్లి కళ్యాణ మండపంలో జరిగిన మహా హారతి, మహా ప్రసాద వితరణతో కార్యక్రమం ముగిసింది. ఈ ఆధ్యాత్మిక మహోత్సవంలో నిజామాబాద్ ప్రభుజీ దేవన్న, నరేందర్ దాస్ ప్రభుజీ, ముకేష్ ప్రభుజీ, విద్యా నరేష్ దాస్ రాజుల, గుండోజీ చందు, హిందూ సమ్మేళన సమితి మండల అధ్యక్షులు ఏనుగు



గంగారెడ్డి, బషీరాబాద్ గ్రామ కమిటీ చైర్మన్ కోప్పేల ప్రవీణ్ రెడ్డి, లక్మ ప్రీథ్వీ రాజ్, ఆయా గ్రామ పంచాయతీల పాలక వర్గ సభ్యులు, యువజన సంఘాలు, బషీరాబాద్ హనుమాన్ భక్త భజన మండలి సభ్యులు మరియు అశేష భక్తజనం పాల్గొన్నారు.




# విజయవంతమైన సులభ్ కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా.

- **సింగరేణి సులబ్ కార్మికులకు హక్కులు అమలు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరిక.**

**డిడి9వార్త / రామగుండం జులై 18:**

సింగరేణి సులభ్ వర్కర్స్ యూనియన్ ( ఐ ఎఫ్ టి యు) ఆధ్వర్యంలో సింగరేణి సులబ్ కార్మికులకు హక్కులు సౌకర్యాలు అమలు చేయాలని ఈరోజు సింగరేణి హెడ్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమం చేపట్టడం జరిగింది
అనంతరం జి ఏం.పర్సనల్ ఐ /ఆర్ అజయ్ కి మెమోరండం జరిగింది. ఈ సందర్భంగా టి. శ్రీనివాస్ (ఐ ఎఫ్ టి యు ) భారత కార్మిక సంఘాల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి ముట్టడి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం అనేక సంవత్సరాలుగా సులువు కార్మికులకు తీవ్రమైనటువంటి అన్యాయం చేస్తుంది అన్నారు చట్టం ప్రకారం రావలసిన హక్కులు రాకుండా సులభ్ ఇంటర్నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సంస్థ అడ్డుపడుతుంటే సింగరేణి యాజమాన్యం కూడా హక్కులు ఇవ్వకుండా సులభ్ సంస్థతో పాటే కార్మికులను మోసం చేస్తోంది. సింగరేణిలో ఇతర కాంట్రాక్ట్ కార్మికులకు అమలు చేసిన హక్కులను కూడా అమలు చేయడం లేదు అన్నారు. ఉత్తరంగా సంస్థల్లో ఇంత అన్యాయం జరుగుతుంటే సింగరేణి యాజమాన్యం ఏం చేస్తున్నట్లు అని ప్రశ్నించారు. కర్మచారి కాంట్రాక్ట్ కార్మికులకు ఉజ్వల్ శానిటైజేషన్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సంస్థ ఈ కార్మికులకు ఈఎస్ఐ పిఎఫ్ బోనస్ అమలు చేస్తామని ముందుకు వచ్చిన సంస్థకు సింగరేణి యాజమాన్యం టెండర్ ఇవ్వడం లేదు. సులోపు సమస్త సింగరేణి అధికారులకు అనుసరణలో సంవత్సరానికి మూడు కోట్ల రూపాయలను కొల్లగొడుతుంటే చూస్తూ ఊరుకుంటున్నారు కానీ ఆరుగాలం కష్టపడి దుర్గంధం మధ్యల జీవిస్తూ మరుగుదొడ్లు కడిగే కార్మికులకు న్యాయంగా చట్టబద్ధంగా రావాల్సిన హక్కులు కల్పించడంలో విఫలం అవుతున్నారు అన్నారు. ఇప్పటికైనా




సింగరేణి యాజమాన్యం సులభ్ కార్మికులకు ఈఎస్ఐ, ఈపీఎఫ్, బోనస్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ ద్వారా ప్రమాద భీమా, అలాగే వృత్తి సంబంధమైన వ్యాధులతో సహజ మరణం చెందుతే 20 లక్షల ఎక్స్ గ్రేషియా, అమలు చేయాలి శిథిలావస్థలో ఉన్న సులభ్ కాంప్లెక్స్ ల ను రిపేర్ చేయాలి, ఈ డిమాండ్లను అమలు చేయకపోతే సింగరేణి వ్యాప్తంగా అన్ని జి.ఎం అవసరం ఉందో నిరసన కార్యక్రమాలు చేపట్టి హైదరాబాద్ లోని సి&ఎం.డీ కార్యాలయాన్ని ముట్టడిస్తాం సింగరేణి యాజమాన్యం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జె సీతారామయ్య ( జి ఎల్ బి కే ఎస్ ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డి బ్రహ్మానందం (ఐఎఫ్ టి యు ,) సింగరేణి సులభ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ వెంకన్న (ఎస్సీసీడబ్ల్యూయు ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎస్ సి సి డబ్ల్యూ యు,రాష్ట్ర ఉపాధ్యక్షులు గౌని నాగేశ్వరరావు, బందు అశోక్, ఎం.డి జాఫర్ ( ఐ ఎఫ్ టి యు) రాష్ట్ర సహకార దర్శి, తాళ్లపల్లి శ్రీనివాస్, బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షులు ఎన్. సంజీవ్ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి రాష్ట్ర నాయకులు మంతెన లక్ష్మయ్య శివరాత్రి భూమయ్య, వెంకటేష్. మహేశ్వరి, ఈశ్వరి విజయ,, తదితరులు పాల్గొన్నారు.




# రూ. 3 కోట్లతో బందంపల్లి మినీ ట్యాంక్ బండ్.

- **తీగల వంతెన కూడా నిర్మిస్తాం.**
- **నాణ్యతతో కూడిన నిర్మాణం చేపట్టాలి.**
- **పెద్దపల్లి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నాం.**
- **చెరువు కట్ట అభివృద్ధికి అదనంగా నిధులు తీసుకొస్తాం.**
- **ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.**

**డిడి9వార్త / పెద్దపల్లి జులై 18:**

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బందంపల్లి వద్ద ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ. 3 కోట్లతో నిర్మించబోయే మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్, సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ విజయరమణ రావు మాట్లాడుతూ..ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పెద్దపల్లి ప్రజలు ఆహ్లాదకరంగా గడిపేందుకు రూ. 3 కోట్ల నిధులతో బంధంపల్లి చెరువు కట్టను మినీ ట్యాంక్ బండ్ గా నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. మినీ ట్యాంక్ బండ్ పనులు పరిశీలించిన సమయంలో చెరువు కట్ట వద్ద మరింత సుందరంగా ఉండేందుకు తీగల వంతెన కూడా నిర్మాణం చేపడతామని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించడం జరిగిందని అన్నారు. మినీ ట్యాంక్ బండ్ పనులను నాణ్యతగా చేపట్టాలని నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా పని చేయాలని గుత్తేదారునికి సూచించడం జరిగిందని పెద్దపల్లి ప్రజలకు రానున్న రోజుల్లోనే మినీ ట్యాంక్ బండ్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పెద్దపల్లి పట్టణాన్ని దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్,నుగుల్లా మల్లయ్య,మున్సిపల్



కమిషనర్ ఆకుల వెంకటేష్ మరియు స్థానిక కౌన్సిలర్,పురేళ్ళ శైలజా సుధాకర్,సంబంధిత ఇరిగేషన్ అధికారులు, పట్టణ కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ ఘాతానికి గురైన యువకుడిని పరామర్శించిన BRS నాయకులు..

**బాధితుడికి మెరుగైన వైద్య సేవలు అందించాలని విజ్ఞప్తి.**

**మణుగూరు. జూలై 17(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలం లో గురువారం నాడు జరిగిన మంత్రుల పర్యటన సందర్భంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తూ విద్యుత్ ఘాతానికి గురై తీవ్ర గాయాలతో కొత్తగూడెం డాక్టర్ నాగరాజు హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న సంతోష్ ను మణుగూరు మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు శుక్రవారం నాడు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం డాక్టర్ గారితో బాధితుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అతడికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తాళ్ళపల్లి యాదగిరి గౌడ్, స్థానిక బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్ సింధు తపస్వి, బోసెట్టి రవిప్రసాద్, గుర్రం సృజన్, పద్దం శ్రీనివాస్, జక్కం రంజిత్, ఆవుల శ్రీను,సూర్య, బోయిళ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు 9 లక్షల రూపాయల ఎల్ఓసీ లను అందజేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.

- **పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్న పాయం.**

**మణుగూరు. జూలై 17(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,బూర్గంపాడు మండలం, పినపాక పట్టినగర్ గ్రామానికి చెందిన కొట్టే గిరిజకు వైద్య సేవల నిమిత్తం మంజూరు అయినటువంటి 5 లక్షలు, మరియు మణుగూరు మండలం, సమితి సింగారం గ్రామ పంచాయతీకి చెందిన తమ్మిశెట్టి చక్రపాణి వైద్య చికిత్స నిమిత్తం మంజూరు అయినటువంటి 4 లక్షల రూపాయల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (LOC) లను శుక్రవారం నాడు మణుగూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారుల సంబంధీకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైద్య సహాయ పథకాల ద్వారా అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# SIR అవకాశాన్ని వినియోగించుకోవాలి

**జనగామ, జూలై 17(డిడి 9వార్త )బ్యూరో**



SIR (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాన్ని ప్రతి అర్హత కలిగిన ఓటరు సద్వినియోగం చేసుకోవాలని టీఎస్ఎంఈఎస్ఏ (TSMESA) జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అంకుషావలి కోరారు. ఓటరు జాబితాలో పేరు నమోదు, సవరణల కోసం అవసరమైన దరఖాస్తులను నింపి ఆగస్టు 3లోగా బీఎల్వోలకు సమర్పించాలని సూచించారు. ఓటు హక్కు పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. SIRకు సంబంధించిన సహాయం కోసం 98484 16812 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

# భూత వైద్యం పేరుతో గిరిజన గర్భిణి మృతి

- **గొంతు కొరకడంతో తీవ్ర ఇన్‌ఫెక్షన్.. మూడు రోజుల పాటు మృత్యువుతో పోరాడి కన్నుమూత**

**భద్రాచలం , జూలై 17 (డిడి9 వార్త)**



బూతవైద్యుడు చేసిన పనికి ఓ నిండు గిరిజన గర్భిణీ బలైంది. ఛత్తీస్గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా, కుంట మండలం మారాయిగూడెం గ్రామానికి చెందిన కురసం హెంకీకి భద్రాచలం ఏరియా ఆసుపత్రి వైద్యులు మెరుగైన వైద్య చికిత్స అందించినప్పటికీ ఆమె మూడు రోజుల పాటు మృత్యువుతో పోరాడుతూ గురువారం రాత్రి మృతి చెందింది. హెంకీకి మారాయిగూడెంలో చికిత్స పేరుతో గొంతును బలంగా కొరకడంతో ఆమె శ్వాసకోస సమస్య, ఇన్‌ఫెక్షన్‌కు గురైంది. దీంతో ఆమెను కుటుంబ సభ్యులు ఈ నెల 13న భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. దీంతో వైద్యులు ఆమెకు శస్త్ర చికిత్స నిర్వహించి ఐసీయులో ఉంచి గత మూడు రోజులుగా వైద్యం అందిస్తున్నారు. కాగా ఆమె పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. ఆసుపత్రికి చేరినప్పటి నుంచే మహిళ పరిస్థితి అత్యంత విషమంగా ఉందని, మూఢనమ్మకాలను నమ్మి ప్రాణాలు కోల్పోవద్దని అనారోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులు లేదా అర్హత కలిగిన వైద్యులను సంప్రదించాలని వైద్యులు ప్రజలకు సూచించారు. అయితే, భూత వైద్యుడి పేరు వెల్లడించేందుకు మృతురాలి బంధువులు నిరాకరించినట్లు సమాచారం. దీంతో పోస్టుమార్టం నిర్వహించకుండా మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిసింది.

# రామాలయంలో 21 మంది నూతన ఉద్యోగుల నియామకం

- **దేవాదాయ శాఖ మంత్రి చేతుల మీదుగా నియామకపత్రాలు అందజేత**

**భద్రాచలం, జూలై 17 (డిడి9 వార్త)**

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో 21 మంది మతపరమైన ఉద్యోగులను నియమించి వారికి నియామక పత్రాలను శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయ, రెవిన్యూ శాఖ కార్యదర్శి శైలజరామయ్యర్, కమీషనర్ హనుమంతరావు చేతుల మీదుగా అందజేశారు. హైదరాబాద్‌లోని తుల్జాభవన్‌లో జూన్ 13న రామాలయంలో 21 పోస్టులకు సంబంధించి 130 మంది వరకు తమ విద్యార్హత, నైపుణ్యాల ఆధారంగా రాత, ప్రతిభ పరీక్షకు హాజరయ్యారు. అర్చక, దివ్యప్రబంద పారాయణం, కృష్ణ యజుర్వేదం, పారాయణదారు, డోలు, సన్నాయి, మృదంగం, సహాయ వంటస్వామి, పరిచారక విభాగాల్లో ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారు. ఎంపికైన 21 మందికి శుక్రవారం హైదరాబాద్‌లో దేవాదాయశాఖ విభాగంలోకి తీసుకుంటూ నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ పూర్తి పారదర్శకంగా నియామక ప్రక్రియ జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అడిషనల్ కమీషనర్ జ్యోతి, శ్రీనివాసరావు, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు, దేవాదాయ శాఖ సలహాదారు గోవింద హరి, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ చీఫ్ ఎగ్జామినర్ శ్రీరామ ఘనపాటి, సీతా డైరెక్టర్ విజయ రాఘవాచార్యులు, యాదగిరిగుట్ట ఈవో భవాని శంకర్‌లు పాల్గొన్నారు.



# గుండెపోటుతో అస్వస్థతకు గురైన సింగరేణి ఉద్యోగి ఉప్పలయ్యను పరామర్శించిన టిబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు.

**మణుగూరు.జూలై 17(డి డి 9వార్త)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు సింగరేణి ఏరియాలోని ఇల్లందు గెస్ట్ హౌస్‌లో కుక్‌గా విధులు నిర్వహిస్తున్న బోయిన ఉప్పలయ్య గుండెపోటుకు గురికావడంతో ఆయనను అత్యవసరంగా శుక్రవారం సాయంత్రం స్థానిక సింగరేణి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉండటంతో ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం మణుగూరు ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు ఆసుపత్రికి చేరుకుని ఉప్పలయ్య ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయనకు అత్యుత్తమ వైద్య సేవలు అందించి ప్రాణాలను కాపాడేందుకు అన్ని విధాలా కృషి చేయాలని వైద్యులు, సిబ్బందిని కోరారు.

ఈ సందర్భంగా నాగెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఉప్పలయ్య త్వరగా కోలుకుని తిరిగి విధుల్లో చేరాలని ఆకాంక్షించారు. క్లిష్ట పరిస్థితుల్లో ఆయనకు నిరంతర వైద్య సేవలు అందిస్తున్న సింగరేణి ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర సిబ్బంది చేస్తున్న సేవలు మరువలేనివి అని ఆయన తెలియచేశారు.

# పోలీస్ కమిషనర్‌తో కడియం కావ్య, శ్రీహరి భేటీ

**జనగామ జూలై 17(డిడి 9వార్త )బ్యూరో**

వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతను కమిషనరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా సమస్యల సత్వర పరిష్కారం, ప్రజలకు మెరుగైన సేవల అందుబాటు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై చర్చించారు. ప్రజలకు సమర్థవంతమైన పాలన అందించేందుకు ప్రజాప్రతినిధులు, పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.



# యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి.

- **యువజన సంఘాల ఏర్పాటు ముగింపు సభలో పాల్గొన్న డివైఓ రాంబాబు**

**జూలై 17 గుండాల (డిడి9 వార్త)**

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, సమాజాభివృద్ధికి పాటుపడాలని జిల్లా యువజన సంఘాల అధికారి రాంబాబు అన్నారు. మండల కేంద్రంలో నవచైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్లో మండల్ వికాస్ అభియాన్ ముగింపు సభలో మాట్లాడుతూ.. విద్యార్థులు, యువకులు గ్రామస్థాయిలో యువజన సంఘాలను ఏర్పాటు చేసుకొని గ్రామ సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలని, సేవా దృక్పథంతో ఉండాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణయ్య, నవ చైతన్య యువజన సంఘం నాయకులు బి వినయ్ మాట్లాడుతూ.. ఎంతో భవిష్యత్తు ఉన్న యువత మద్యపానానికి అలవాటు కావద్దని కోరారు. యువజన, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈసం శివ, కే సంతోష్, ఆజాద్, కళాశాల అధ్యాపకులు బాలస్వామి చారి రఘు తదితరులు పాల్గొన్నారు.




# ప్రతిపక్షాల ఆరోపణలను రైతులు నమ్మొద్దు: కడియం శ్రీహరి

**జనగామ జూలై 17(డిడి 9వార్త )బ్యూరో**

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం జరుగుతోందని, ప్రతిపక్షాలు రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. లింగాల ఘనపూర్ మండలం సిరిపురంలో సీసీ రోడ్డు, ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన ఆయన, అనంతరం కల్యాణలక్ష్మిషాదీ ముబారక్, సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు.

దేశవ్యాప్తంగా ఎల్‌నీనో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వానిదే తప్పు అంటూ ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు.రైతులు పరిస్థితులకు అనుగుణంగా ఆరుతడి పంటలు సాగు చేయాలని, వరి సాగులో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సిరిపురం అభివృద్ధికి రూ.1.60 కోట్ల పనులు చేపట్టినట్లు వెల్లడించిన ఆయన, మరో విడతలో అదనపు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.ఇ కార్యక్రమంలో జనగామ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గుడి వంశీధర్ రెడ్డి మరియు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు



# ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల సమగ్రాభివృద్ధి: ఎమ్మెల్యే పల్లా

**జనగామ జూలై 17(డిడి 9వార్త)బ్యూరో**

చేర్యాల మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం స్వయం సహాయక మహిళా సంఘాల వీఓ భవనాలు, నూతన గ్రామపంచాయతీ భవనాలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం భవనాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారతకు స్వయం సహాయక సంఘాలు కీలకమని పేర్కొన్నారు. మహిళా సంఘాలకు అందిస్తున్న వడ్డీలేని రుణాల పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. బాలికలకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు కస్తూరిబా విద్యాలయ భవనం ఉపయోగపడుతుందని తెలిపారు.

చేర్యాల మండలంలో రహదారులు, డ్రైనేజీలు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, నాణ్యమైన పనులతో ప్రజలకు ఉపయోగపడే శాశ్వత ఆస్తుల నిర్మాణమే లక్ష్యమన్నారు. ప్రజల సహకారంతో రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.




# బిఈడి కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

- **భద్రాచలం ఐటీడీఏ పీవో బి. రాహుల్**

**భద్రాచలం , జూలై 17( డిడి9 వార్త)**



202628 విద్యా సంవత్సరమునకు గాను రాష్ట్రంలోని ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంత గిరిజన అభ్యర్థుల సంక్షేమార్థం భద్రాచలం ఐటిడిఏ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ప్రత్యేక గిరిజన బీఈడీ కళాశాలలో రెగ్యులర్ బి.ఎడ్ కోర్సులో ప్రవేశం నిమిత్తం ఏజెన్సీ షెడ్యూల్డ్ ప్రాంత గిరిజన పట్టభద్రుల నుండి నేరుగా దరఖాస్తులను కోరుతున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ శుక్రవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో మొత్తం 100 సీట్లు కలవని, కళాశాలలో ప్రవేశానికి అర్హతలు తెలంగాణకు చెందిన అభ్యర్థులు ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంతములకు చెందిన గిరిజన పట్టభద్రులై ఉండవలెనని, డిగ్రీ పాసై కనీసం 40శాతం మార్కులు సాధించి ఉండాలని, సంబంధిత డిగ్రీ పరీక్షలో సాధించిన మెరిట్ ని బట్టి ఎంపిక జరుగుతుందన్నారు. ఈ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఏటూరు నాగారం, ఉట్నూర్, మన్ననూరు ఐటిడిఏ కార్యాలయంలలోను, గిరిజన బిఈడి కళాశాల భద్రాచలం నందు దరఖాస్తులు ఉచితంగా పొందవచ్చని తెలిపారు. పూర్తి చేసి వచ్చేనెల ఆగస్టు 16వ తారీకు వరకు సమర్పించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8247528404, 82477 98370, 99122 72959 ఫోన్ నెంబర్లను సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని కోరారు.




# అక్రమ రవాణా నివారణలో యువత పాత్ర కీలకం

- ప్రజ్వల సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహణా
- పాల్గొన్న ప్రిన్సిపాల్ నళిని శ్రీ, సంస్థ సమన్వయ కర్త సురేష్ కుమార్




**బోనకల్,జూలై 17,(డీడీ9 వార్త):**
బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం బాల బాలికలకు ఆడపిల్లల అక్రమ రవాణా పై అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నళిని శ్రీ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అని వారిని కాపాడు కోవడం మన అందరి బాధ్యత ముఖ్యంగా యువత అక్రమ రవాణా, సైబర్ ట్రాఫికింగ్ పై అవగాహనా పెంచుకుని మంచి సమాజాన్ని నిర్మించడంలో ప్రముఖ పాత్ర పోశించాలన్నారు,తెలిసి తెలియని వయసులో యువత చెడు దారిలో వెళ్తూ, జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. మొబైల్ ఫోన్, చెడు సహవాసాలు చేయడం ద్వారా అనైతిక కార్యక్రమాలకు అలవాటుపడుతున్నారు. ఇలాంటి అవగాహనా కార్యక్రమాల ద్వారా అవగాహనా పెంచుకుని అప్రమతంగా ఉండాలని అన్నారు
స్టూడెంట్ కౌన్సిలర్ జోనధన్ మాట్లాడుతూ అక్రమ రవాణా అనేది ప్రపంచ వ్యాప్తంగా అతి పెద్ద నేరంగా ఉందనీ విద్యార్థులు అప్రమతంగా ఉండి మంచి జీవితాన్ని అనుభవించాలి అన్నారు,ప్రజ్వల సమన్వయకర్త సురేష్ కుమార్ మాట్లాడుతూ
ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు పద్మ శ్రీ అవార్డు గ్రహిత సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 34500 మంది అమ్మాయిలను చిన్న పిల్లలను కాపాడడం జరిగిందన్నారు,యువత ఆల్కహాల్ సేవించడం మరియు అస్లీల చిత్రాలు చూడడం ద్వార చెడు దారిలో పయనిస్తూ జీవితాన్ని నాశనం చేయనుకుంటున్నారు,విద్యార్థుల భవిష్యత్ కాపాడాలని దీని కొరకు విద్యార్థులు సైబర్ ట్రాఫికింగ్, అక్రమ రవాణా అంశాలపై అవగాహనా కలిగి ఉండాలని మరియు వీటి బారినపడినట్లు గ్రహిస్తే వెంటనే 100 పోలీస్ కి గాని, 1930 సైబర్ ట్రాఫికింగ్ టోల్ ఫ్రీ నంబర్స్ ను సంప్రదించాలి అని సూచించారు పిల్లలు ప్రమాదంలో ఉంటే 1098, మహిళలు ప్రమాదంలో ఉంటే 181, సైబర్ సంబంధిత ప్రమాదంలో ఉంటే 1930 నెంబర్ లను సంప్రదించాలని అన్నారు.ఈ కార్యక్రమం లో ప్రజ్వల సిబ్బంది భూపాల్, హరీష్, కళాశాల స్టూడెంట్ కౌన్సిలర్ జోనతాన్ బాబు , ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ అంతోటి. తిరుపతి రావు, లెక్చరర్లు రాజేందర్ కుమార్, లక్ష్మి కాంతం, పద్మావతి, రామ కృష్ణ, రమేష్, రాజేందర్, ప్రియకుమార్ రెడ్డి, మురళి కృష్ణ, యశోద, శాంతి ప్రియా, లైబ్రరియన్ మోహన్, సీనియర్ అసిస్టెంట్ మధార్, జశ్వంత్, బుజ్జమ్మ, అరుణ విద్యార్థి విద్యార్థినులు పాల్గొన్నారు.

# మైదానంలోనే కాదు.. వ్యాపారంలోనూ కింగ్.. మెస్సీ లగ్జరీ హోటల్ సామ్రాజ్యం!






**డిడి9 వార్త:**
లియోనెల్ మెస్సీ.. ఈ పేరుకు ప్రత్యేక పరిచయం అక్కర్లేదు.ఫుట్‌బాల్ మైదానంలో తన అద్వితీయమైన ఆటతీరుతో లెక్కలేనన్ని రికార్డులు బద్దలు కొట్టి, కోట్లాది మంది అభిమానుల గుండెల్లో 'GOAT' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్)గా నిలిచాడు. అయితే, ఫుట్‌బాల్ ప్రపంచానికి రారాజుగా వెలుగొందుతున్న మెస్సీకి మరో కోణం కూడా ఉంది. అదే..లగ్జరీ హాస్పిటాలిటీ రంగంలో విజయవంతమైన వ్యాపారవేత్తగా రాణించడం. ఆటలో ఎలా గోల్స్ కొడతాడో, వ్యాపారంలోనూ అంతే పెద్ద విజయాలు సాధించగలడని మెస్సీ నిరూపిస్తున్నాడు.

**'MiM హోటల్స్'.. మెస్సీ లగ్జరీ బ్రాండ్**
ఫుట్‌బాల్‌కు దూరంగా, మెస్సీ 'MiM హోటల్స్' పేరుతో ఒక లగ్జరీ బొటిక్ హోటల్స్ చైన్‌ను నిర్మించాడు. స్పెయిన్, అండోర్రా వ్యాప్తంగా ఆరు అత్యంత విలాసవంతమైన హోటళ్లు ఈ బ్రాండ్ కింద ఉన్నాయి. బార్సిలోనా సమీపంలోని సిట్జెస్, ఇబిజా, మల్లోర్కా, పైరినీస్ పర్వతాల్లోని బకేరా, అండోర్రా, అండలూసియాలోని సోటోగ్రాండే వంటి ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ఈ హోటళ్లు కొలువుదీరాయి. ఒక్కో హోటల్ ఒక్కో ప్రత్యేకతను సంతరించుకుంది. సముద్ర తీర అందాలను ఆస్వాదించాలనుకునే వారికి, పర్వత ప్రాంతాల్లో స్కీయింగ్ చేయాలనుకునే వారికి, ప్రశాంతమైన వాతావరణంలో సేద తీరాలనుకునే వారికి అనుగుణంగా ఈ హోటళ్లను తీర్చిదిద్దారు.

**హోటళ్లలో మెస్సీ ముద్ర..**
**అభిమానులకు పండుగ**
ఈ హోటళ్లలో మెస్సీ ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. ఫుట్‌బాల్ అభిమానులను ఆకట్టుకునేలా అనేక ప్రత్యేకతలు ఇక్కడ ఉన్నాయి. కొన్ని హోటళ్లలో 'లియో మెస్సీ సూట్స్' పేరుతో ప్రత్యేక గదులు అందుబాటులో ఉన్నాయి. అంతేకాకుండా మెస్సీ గెలుచుకున్న ప్రఖ్యాత బాలోన్ డి'ఓర్ ట్రోఫీల రెప్లికాలను కూడా ప్రదర్శనకు ఉంచారు. దీంతో ఈ హోటళ్లు కేవలం లగ్జరీ ప్రయాణికులకే కాకుండా మెస్సీ అభిమానులకు కూడా ఒక యాత్రా స్థలంగా మారాయి. రాత్రి బసకు సుమారు 600 యూరోలు (సుమారు రూ. 66,000) వరకు చార్జ్ చేసే ఈ హోటళ్లలో అత్యాధునిక వెల్‌నెస్ సౌకర్యాలు, ప్రైవేట్ రూఫ్‌టాప్ జాకుజీలు కూడా ఉన్నాయి.

**మిషెలిన్ స్టార్ చెఫ్‌తో కలిసి ఫుడ్ ఫెస్ట్**
ఈ హోటళ్లలో ఆహారానికి కూడా పెద్దపీట వేశారు. బకేరా, అండోర్రా, సోటోగ్రాండేలోని మూడు హోటళ్లలో 'హించా' పేరుతో రెస్టారెంట్లను నిర్వహిస్తున్నారు. వీటిని ప్రఖ్యాత మిషెలిన్ స్టార్ చెఫ్ నందు జుబానీతో కలిసి మెస్సీ అభివృద్ధి చేశాడు. మెస్సీ ఫుట్‌బాల్ కెరీర్‌కు నివాళిగా, బాలోన్ డి'ఓర్ స్ఫూర్తితో రూపొందించిన ఒక ప్రత్యేక డెజర్ట్ ఇక్కడి మెనూలో హైలైట్‌గా నిలుస్తుంది. ఈ హోటళ్ల నిర్వహణ బాధ్యతలను ప్రముఖ 'మెలియా హోటల్స్ ఇంటర్నేషనల్' సంస్థ చూసుకుంటుండగా, యాజమాన్య హక్కులు మాత్రం పూర్తిగా మెస్సీ వద్దే ఉన్నాయి. హాస్పిటాలిటీ రంగంతో పాటు రియల్ ఎస్టేట్, స్పోర్ట్స్ ఓనర్‌షిప్, మీడియా, టెక్నాలజీ, దుస్తుల వ్యాపారం వంటి అనేక రంగాల్లోకి మెస్సీ తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించాడు. ఫుట్‌బాల్ మైదానంలో ట్రోఫీలు గెలవడం నుంచి లగ్జరీ హోటల్ సామ్రాజ్యాన్ని నిర్మించడం వరకు, మెస్సీ గెలుపు మంత్రం కేవలం ఆటకు మాత్రమే పరిమితం కాదని స్పష్టమవుతోంది.





# చంద్రుగొండ మండలంలో అభివృద్ధి పండుగ

- ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీలు రేణుక చౌదరి, రఘురామిరెడ్డి, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మద్దుకూరులో రైతుల చిరకాల స్వప్నం.. సీతారామ కాలువ నీటి విడుదల...
- రూ. 35 లక్షలతో నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన

**అశ్వారావుపేట:జూలై17(డిడి 9వార్త)**
చంద్రుగొండ మండలంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు మరియు రైతులకు మేలు చేకూర్చే సాగునీటి విడుదల కార్యక్రమాలు అత్యంత ఘనంగా జరిగాయి.
ఈ కార్యక్రమాలలో తెలంగాణ రాష్ట్ర రాజ్యసభ సభ్యురాలు గౌరవనీయులు శ్రీమతి రేణుక చౌదరి, ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్లమెంట్ సభ్యులు గౌరవనీయులు శ్రీ రామసహాయం రఘురామిరెడ్డి, మరియు అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ జారె ఆదినారాయణ ,జిల్లా PO రాహుల్ గ్రంథాలయం చైర్మన్ పసుపులేటివీరబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.
మొదటగా మద్దుకూరు గ్రామంలో రైతుల చిరకాల స్వప్నమైన సీతారామ కాలువ నుండి పొలాలకు సాగునీటి విడుదల కార్యక్రమాన్ని నేతలు ఘనంగా ప్రారంభించారు. కాలువ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి నీటిని విడుదల చేసిన అనంతరం చంద్రుగొండ మండలం పరిధిలోని తుంగారం గ్రామ పంచాయతీ పరిధిలో రూ. 5 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన CC రోడ్లను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అలాగే చంద్రుగొండ మండల కేంద్రంలో రూ. 35 లక్షల అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన నూతన లైబ్రరీ (గ్రంథాలయ) భవన నిర్మాణానికి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ భవనం త్వరలోనే యువతకు, విద్యార్థులకు అందుబాటులోకి రానుందని ప్రజాప్రతినిధులు తెలిపారు. చివరగా, మండల ప్రజల రవాణా సౌకర్యాల దృష్ట్యా ఆధునీకరించిన బస్టాండ్‌ను అత్యంత ఘనంగా పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా మండల ప్రజలు, నాయకులు తమ ప్రియతమ ప్రజాప్రతినిధులకు ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు, రైతులు పాల్గొన్నారు------



# రైతుల సంక్షేమమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం..

- తాలిపేరు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువ గేట్లను ఎత్తి నీటిని విడుదల చేసిన స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు..

**చర్ల, జూలై 17 (డిడి 9 వార్త)**
చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువ గేట్లను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఎత్తి ప్రారంభించి చర్ల, దుమ్ముగూడెం మండలాల రైతులకు సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయమే ఈ ప్రాంత ప్రజల జీవనాధారమని, రైతులకు సకాలంలో సాగునీరు అందించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. తాలిపేరు ప్రాజెక్టు ద్వారా విడుదలైన సాగునీటిని రైతులు సద్వినియోగం చేసుకుని పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. తాలిపేరు ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేయడంతో చర్ల, దుమ్ముగూడెం మండలాల పరిధిలోని వేలాది ఎకరాలకు నీరందనున్న నేపథ్యంలో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు చీమలమర్రి మురళీ కృష్ణ, చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ నాయుడు, బ్రహ్మానంద రెడ్డి, లంక రాజు, ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల బుచ్చిబాబు, ఇందల రమేష్, సీతాపతి రాజు, ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ అధికారులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వర్షా భావం ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి..

- మండల వ్యవసాయ అధికారి పి. వినయ్ కుమార్

**బోనకల్,జూలై 17,(డీడీ9 వార్త):**
ప్రస్తుత వర్షభావ పరిస్థితులు, భూగర్భ జలాల క్షీణతను దృష్టిలో ఉంచుకొని రైతులు వరి మరియు మిర్చి సాగుకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల సాగు వైపు మొగ్గు చూపాలని బోనకల్ మండల వ్యవసాయ అధికారి పి. వినయ్ కుమార్ పేర్కొన్నారు.
మండలంలో ఎక్కువగా రాపల్లి, కలకోట, పెదబీరవల్లి, మోటమర్రి, నారాయణపురం గ్రామాల్లో వరి సాగు చేస్తున్నారు కావునా ఎల్ నినో ద్వారా వర్షాభావం ఏర్పడే అవకాశం ఉందనీ పంటల సరళిని మార్చి తక్కువ వ్యవధిలో గల పంటలను వేసుకోవాలి.
మండల పరిధిలోని రాపల్లి గ్రామంలో రైతులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ వర్షపాతం తక్కువగా ఉన్న తరుణంలో నీటి లభ్యతను భట్టి రైతులు తమ పంటల ప్రణాళికను మార్చుకోవాలన్నారు. వరికి బదులుగా తక్కువ నీటితో , తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు అందించే ఆరుతడి పంటలైన పెసర, కంది ,మినుములు, నువ్వులు ,కొర్రలు జొన్నలు ,వంటి పంటలను సాగు చేయాలని సూచించారు,అదేవిధంగా రైతుల పొలాల్లో నీటినిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం నూరు శాతం సబ్సిడీతో పంట కుంటలను ఏర్పాటు చేస్తుందని తెలిపారు ఈ కుంటల ద్వారా వర్షపు నీటిని నిలువ చేసుకొని పంటలకు అవసరమైన సమయంలో వాడుకోవచ్చని ,తద్వారా భూగర్భ జలాల మట్టం కూడా పెరుగుతుందని వివరించారు,ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్కే హుస్సేన్ సాహెబ్, సొసైటీ ఛైర్మన్ నాగేశ్వరరావు రైతులు పుల్లారావు, వెంకటేశ్వర్లు, జనార్ధన్, ప్రసాద్, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.




# డోపింగ్ వివాదంలో పాక్ క్రికెటర్ మొహమ్మద్ నవాజ్‌కు భారీ ఊరట.. కానీ ఆ రికార్డులు రద్దు!

- డోపింగ్ నిబంధనలు ఉల్లంఘించిన పాక్ క్రికెటర్ మొహమ్మద్ నవాజ్
- మూడు నెలల నిషేధాన్ని నెలకు తగ్గించిన అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్
- గంజాయి సంబంధిత పదార్థం వాడినట్టు అంగీకరించిన నవాజ్
- క్రీడా ప్రదర్శనకు సంబంధం లేదని రుజువు చేయడంతో దక్కిన ఊరట
- లంక ప్రీమియర్ లీగ్‌లో ఆడేందుకు మార్గం సుగమం

**డిడి9 వార్త:**
పాకిస్థాన్ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ మొహమ్మద్ నవాజ్‌కు డోపింగ్ వివాదంలో భారీ ఊరట లభించింది. ఐసీసీ యాంటీడోపింగ్ నిబంధనలను ఉల్లంఘించినందుకు అతనిపై విధించిన మూడు నెలల నిషేధం ముగిసింది. ప్రత్యేక చికిత్సా కార్యక్రమాన్ని పూర్తి చేయడం ద్వారా అతని శిక్షను ఒక నెలకు తగ్గించడంతో నవాజ్ మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టేందుకు మార్గం సుగమమైంది.

**ఏమిటీ వివాదం?**
ఈ ఏడాది ఫిబ్రవరి 7న శ్రీలంకలోని కొలంబోలో నెదర్లాండ్స్‌తో జరిగిన టీ20 ప్రపంచ కప్ 2026 ప్రారంభ మ్యాచ్ అనంతరం నవాజ్‌కు యాంటీడోపింగ్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో అతను 'కార్బాక్సీటీహెచ్‌సీ' (Carboxy THC) అనే నిషేధిత ఉత్ప్రేరకాన్ని వాడినట్టు పాజిటివ్‌గా తేలింది. కార్బాక్సీటీహెచ్‌సీ అనేది గంజాయిలో ఉండే ప్రాథమిక సైకోయాక్టివ్ రసాయనమైన టీహెచ్‌సీ ఉత్పత్తి. మానవ శరీరం గంజాయిని ప్రాసెస్ చేసినప్పుడు, కాలేయం ఈ సమ్మేళనాన్ని నిర్దిష్ట పదార్థంగా మారుస్తుంది. ఇది శరీరంలో ఎక్కువ కాలం నిల్వ ఉండటం వల్ల, సాధారణ మూత్ర పరీక్షల్లో దీనిని ప్రధాన లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్‌ను గుర్తిస్తారు.

**శిక్ష తగ్గడానికి కారణం**
తాను నిబంధనలను ఉల్లంఘించినట్లు 32 ఏళ్ల నవాజ్ అంగీకరించాడు. అయితే, ఈ పదార్థాన్ని తాను పోటీలకు వెలుపల ఉపయోగించానని, క్రీడా ప్రదర్శనను మెరుగుపరుచుకోవడానికి దీనికి ఎలాంటి సంబంధం లేదని ఐసీసీ ముందు నిరూపించుకోగలిగాడు. దీంతో ఐసీసీ మొదట మూడు నెలల అనర్హత వేటు వేసినప్పటికీ, అతని వివరణతో సంతృప్తి చెందింది. మే 1 నుంచి అతను స్వచ్ఛందంగా తాత్కాలిక సస్పెన్షన్ ప్రారంభించిన తేదీ నుంచి ఈ శిక్షను వర్తింపజేసింది. అంతేకాకుండా ఆమోదిత మాదకద్రవ్యాల దుర్వినియోగ చికిత్సా కార్యక్రమాన్ని పూర్తి చేస్తే, శిక్షను ఒక నెలకు తగ్గిస్తున్నట్టు ఐసీసీ వెసులుబాటు కల్పించింది.
నేడు ఐసీసీ విడుదల చేసిన ఒక ప్రకటనలో.. "నవాజ్ తనపై విధించిన శిక్షను అంగీకరించి, చికిత్సా కార్యక్రమానికి కట్టుబడి ఉన్నందున, సుమారు రెండున్నర నెలల సస్పెన్షన్ పూర్తి చేసుకున్న తర్వాత అతని తాత్కాలిక నిషేధాన్ని ఎత్తివేయడం జరిగింది. ఐసీసీ సంతృప్తి మేరకు చికిత్సా కార్యక్రమాన్ని పూర్తి చేస్తే, నవాజ్ ఇకపై ఎలాంటి అనర్హత కాలాన్ని ఎదుర్కోవాల్సిన అవసరం లేదు" అని స్పష్టం చేసింది.

**రికార్డులు రద్దు.. కెరీర్ ప్రస్థానం**
అయితే, ఐసీసీ యాంటీడోపింగ్ కోడ్ ప్రకారం.. ఫిబ్రవరి 7న నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్ నుంచి మే 1 వరకు నవాజ్ ఆడిన అన్ని మ్యాచ్‌లలో అతని వ్యక్తిగత రికార్డులను అధికారికంగా రద్దు చేశారు. శ్రీలంకలో జరిగిన 2026 టీ20 ప్రపంచ కప్‌లో పాకిస్థాన్ తరపున నవాజ్ మొత్తం ఏడు మ్యాచ్‌లు ఆడాడు. ఈ టోర్నమెంట్‌లో పాక్ జట్టు సూపర్ ఎయిట్ దశలోనే నిష్క్రమించింది. ఈ ప్రపంచ కప్‌లో నవాజ్ పెద్దగా రాణించలేకపోయాడు, కేవలం 15 పరుగులు చేసి ఏడు వికెట్లు పడగొట్టాడు. ఇక, పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)లో ముల్తాన్ సుల్తాన్స్ తరపున 10 మ్యాచ్‌లలో 54 పరుగులు చేసి ఆరు వికెట్లు తీశాడు. తాజాగా అతనికి లంక ప్రీమియర్ లీగ్ (ఎల్‌పీఎల్)లో గాలె గ్యాలంట్స్ తరపున ఆడేందుకు నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) కూడా లభించడంతో నవాజ్ త్వరలోనే మళ్లీ ఆటలో కనిపించనున్నాడు.



8 DD9 వార్త తెలుగు దినపత్రిక DD9 Vaartha శనివారం 18-07-2026 హైదరాబాద్

# బాలీవుడ్‌లో ఒకరినొకరు తొక్కేయడమే తెలుసు..



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమై తన నటనతో చెరగని ముద్ర వేసుకుంది. టాలీవుడ్ స్టార్ హీరోలందరి సరసన నటించి టాప్ హీరోయిన్‌గా నిలిచిన ఈ భామ, కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పడే బాలీవుడ్‌కు చెక్కేసింది. ప్రస్తుతం హిందీలో వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్న రకుల్, ఇటీవల వచ్చిన 'పతి పత్నీ ఔర్ వో దో' చిత్రంతో ప్రేక్షకులను అలరించింది. ప్రస్తుతం ఆమె 'రామాయణ పార్ట్-2', 'నాగిల్లా' వంటి భారీ సినిమాల షూటింగ్స్‌తో ఫుల్ బిజీగా గడుపుతోందిఅయితే, తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన రకుల్.. తెలుగు, హిందీ చిత్ర పరిశ్రమల మధ్య ఉన్న తేడాల గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. టాలీవుడ్ పద్ధతులు చాలా బాగుంటాయని చెప్తూ మన తెలుగు ఇండస్ట్రీపై ప్రశంసలు కురిపించింది. బాలీవుడ్ పరిశ్రమతో పోలిస్తే తెలుగు సినీ పరిశ్రమ ఎంతో సహాయకారిగా, ఐక్యంగా ఉంటుందని రకుల్ చెప్పింది.

బాలీవుడ్‌లో నటీనటుల మధ్య అభద్రతాభావం , అసూయ ఎక్కువగా ఉంటాయని.. అందుకే అక్కడ ఒకరి సినిమాలకు మరొకరు మద్దతు ఇవ్వరని ఆమె అభిప్రాయపడింది.

అంతేకాకుండా, ఒకరి సినిమాలపై మరొకరు నెగిటివ్ ప్రచారం కూడా చేసుకుంటారని ఒకరినొకరు తొక్కేయడమే అక్కడివాళ్లకి తెలుసని రకుల్ సంచలన వ్యాఖ్యలు చేసింది. కానీ, మన తెలుగు ఇండస్ట్రీలో మాత్రం వాతావరణం చాలా భిన్నంగా ఉంటుందని చెప్పిందిటాలీవుడ్‌లో ప్రతి ఒక్కరూ వేరే హీరోల ట్రైలర్లను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ప్రమోట్ చేస్తారని, ఒకరి విజయాలను మరొకరు మనస్ఫూర్తిగా ఎంజాయ్ చేస్తారని రకుల్ గుర్తుచేసింది. ఇక్కడ అందరూ కలిసికట్టుగా ఉంటారని ప్రశంసించింది. ఒకవేళ బాలీవుడ్ కూడా తెలుగు ఇండస్ట్రీ లాంటి ఐక్యతను, మంచి గుణాన్ని అలవర్చుకుంటే.. మన దేశంలోనే మన సినిమా పరిశ్రమ అత్యంత బలమైనదిగా మారుతుందని రకుల్ ప్రీత్ సింగ్ చెప్పకొచ్చింది.

టాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీలకు అదృష్టం కలిసిరావడం లేదు. తన టాలెంట్ చూపించినప్పటికీ నిరాశనే ఎదురవుతోంది. ఆమె ఇటీవల నటించిన చిత్రాలు వరుసగా బాక్సాఫీస్ వద్ద పరాజయం పాలయ్యాయి. ముఖ్యంగా భారీ అంచనాలతో వచ్చిన 'ఉస్తాద్ భగత్ సింగ్', 'పరాశక్తి' వంటి సినిమాలు ప్రేక్షకులను మెప్పించలేకపోవడంతో ఈ భామపై విమర్శలు వస్తున్నాయి. ఈ వరుస ఫ్లాపుల వల్ల ఆమెను కొన్ని సినిమాల నుండి తొలగిస్తున్నారనే ప్రచారం సోషల్ మీడియాలో జోరందుకుంది. దీనికి తోడు నెట్టింట ట్రోలింగ్ కూడా గట్టిగానే జరుగుతోంది. ఈ నేపథ్యంలో, తాజాగా జరిగిన ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రీలీల ఆసక్తికర కామెంట్స్ చేసింది. తన అభిమానుల కోసం తాను ఏదైనా చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఈ సందర్భంగా స్పష్టం చేసింది.

తనకు అభిమానులను నేరుగా కలుసుకోవడం ఎంతో ఇష్టమని, వారి చూపే ప్రేమ, ఉత్సాహం తనకు కొత్త ఎనర్జీని ఇస్తాయని చెప్పకొచ్చింది. తనలాంటి కళాకారులను ఎల్లప్పడూ బ్రతికించేది ప్రేక్షకులేనని, అందుకే వారిని అలరించేందుకు భవిష్యత్తులో మరింత శ్రమించి మంచి సినిమాలను అందిస్తూనే ఉంటానని శ్రీలీల తన పేర్కొన్నారు. ఒకపక్క తెలుగులో ఎదురుదెబ్బలు తగులుతున్నా.. ఈ ముద్దుగుమ్మ క్రేజ్ మాత్రం తగ్గడం లేదు. ప్రస్తుతం ఆమె తమిళ, హిందీ భాషల్లోని స్టార్ హీరోల సరసన అవకాశాలు దక్కించుకుంటూ ముందుకు సాగుతోంది. ప్రస్తుతం ధనుష్ సరసన 'D-55' సినిమాలో నటిస్తూ బిజీగా ఉంది. వీటితో పాటు బాలీవుడ్‌లో కూడా అడుగుపెడుతూ.. క్రేజీ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన మోస్ట్ అవేటెడ్ లవ్ సాగా 'ఆషికి-3' సినిమాలో హీరోయిన్‌గా ఎంపికైంది.



## నన్ను బ్రతికిస్తున్న అభిమానుల కోసం ఏదైనా చేయడానికి సిద్ధంగా ఉన్నాను

# విజయ్ దేవరకొండ మూవీకి బ్రేక్..



సినీ పరిశ్రమలో ఎంతో నమ్మకంతో సినిమాను ప్రారంభించినప్పటికీ, చిత్రీకరణలో కొంత భాగం పూర్తయ్యాక అవుట్‌పుట్ ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ప్రాజెక్టులను నిలిపివేసిన సందర్భాలు చాలానే ఉన్నాయి. అలాంటి సంఘటనే విజయ్ దేవరకొండ కెరీర్‌లో కూడా చోటుచేసుకుంది. ఆ వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం. 2019లో విజయ్ దేవరకొండ హీరోగా నటించిన 'డియర్ కామ్రేడ్' సినిమా విడుదలైంది. అయితే ఈ చిత్రం ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. అనంతరం ఆనంద్ అన్నామలై దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో 'హీరో' అనే టైటిల్‌తో స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో ఓ సినిమాను ప్రారంభించారు. ఇందులో విజయ్ ప్రొఫెషనల్ బైక్ రేసర్ పాత్రలో నటించాల్సి ఉంది. ఈ చిత్రంలో మాళవిక మోహనన్, శాలిని పాండే హీరోయిన్లుగా ఎంపికయ్యారు.

ఈ సినిమా ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించడంతో పాటు, తొలి షెడ్యూల్‌ను సుమారు రూ.6 కోట్ల వ్యయంతో చిత్రీకరించారు. అయితే మొదటి షెడ్యూల్ అవుట్‌పుట్‌ను చూసిన తర్వాత విజయ్ దేవరకొండ పూర్తిగా సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. దీంతో స్క్రిప్ట్‌లో మార్పులు చేయాలని భావించినప్పటికీ, ఆ విషయంలో దర్శకుడు హీరో, నిర్మాతలను పూర్తిగా ఒప్పించలేకపోయాడని సమాచారం. తర్వాత ఈ సినిమా మళ్లీ ప్రారంభం కానుందని వార్తలు వచ్చినా, విజయ్ వరుస సినిమాలతో బిజీ కావడంతో ఈ ప్రాజెక్ట్ పూర్తిగా పక్కన పడిపోయింది. దీంతో విజయ్ దేవరకొండ - మైత్రి మూవీ మేకర్స్ కాంబినేషన్‌లో తెరకెక్కాల్సిన 'హీరో' సినిమా తొలి షెడ్యూల్ పూర్తైన తర్వాతే నిలిచిపోయింది. ప్రస్తుతం మాత్రం విజయ్ దేవరకొండ, మైత్రి మూవీ మేకర్స్ కాంబినేషన్‌లో 'రణబాలి' చిత్రం తెరకెక్కుతుండగా, ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి.

# ఆ సినిమా నా జీవితాన్నే మార్చేసింది..



ప్రముఖ నటుడు, రచయిత పోసాని కృష్ణమురళి తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తన సినీ కెరీర్‌కు కీలక మలుపు తీసుకొచ్చిన 'నాయక్' సినిమా గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. పోసాని మాట్లాడుతూ.. నా కెరీర్‌ను పూర్తిగా మార్చేసిన చిత్రాల్లో 'నాయక్' మొదటి స్థానంలో ఉంటుంది. ఆ సినిమాకు వి.వి. వినాయక్ దర్శకత్వం వహించారు. ఆయనంటే నాకు ఎంతో అభిమానం. నేను ఆయనను ప్రేమగా 'వినయ్' అని పిలుస్తాను. ఆయన నన్ను 'మురళి' అని పిలుస్తారు.

ఒకసారి నేను మరో సినిమా షూటింగ్ కోసం ప్రయాణిస్తుండగా వినయ్ ఫోన్ చేసి 'రామ్ చరణ్ హీరోగా 'నాయక్' సినిమా చేస్తున్నాను. అందులో మీ కోసం మంచి కామెడీ పాత్ర ఉంది. మూడు రోజులు డేట్స్ అడ్జస్ట్ చేయగలరా?' అని అడిగారు. నేను వెంటనే అంగీకరించాను. మొదటి రోజు షూటింగ్‌లోనే నా డైలాగ్‌లకు యూనిట్ మొత్తం పగలబడి నవ్వింది. ఆ రోజు షూటింగ్ పూర్తయ్యాక మరుసటి రోజు వినయ్ వచ్చి 'మీ సన్నివేశాలకు అందరూ అద్భుతంగా స్పందిస్తున్నారు. మీ పాత్రను మరింత పెంచుదాం' అన్నారు.

అలా మూడు రోజుల పాత్ర కాస్త 17 నుంచి 18 రోజుల షూటింగ్‌గా మారింది. అంతేకాకుండా సినిమా విడుదలకు ముందు చిరంజీవి తన సన్నివేశాలు చూసి ఎంతో నవ్వారని, ఒక్క సీన్ కూడా కట్ చేయొద్దు అని దర్శకుడు వినాయక్‌కు సూచించారని పోసాని చెప్పారు. సినిమా విడుదలైన తర్వాత ప్రేక్షకుల నుంచి తన పాత్రకు అద్భుతమైన స్పందన వచ్చిందని, విడుదలైన వారం రోజుల్లోనే ఏకంగా 36 సినిమాల్లో నటించే అవకాశాలు వచ్చాయని పోసాని కృష్ణమురళి తెలిపారు. 'నాయక్' తన సినీ ప్రయాణంలో అత్యంత కీలకమైన చిత్రంగా ఎప్పటికీ గుర్తుండిపోతుందని ఆయన పేర్కొన్నారు.



## భర్త ఎఫైర్ పెట్టుకుంటే వదిలేయండి పెద్ద ఇష్యూ చేయొద్దు..

టాలీవుడ్ హీరో రాజశేఖర్ భార్య, నటి జీవిత ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత ఇండస్ట్రీకి కాస్త దూరంగా ఉన్నప్పటికీ.. తన భర్తకు అన్ని విషయాల్లో తోడుగా నిలుస్తూ వస్తున్నారు. నటనకు దూరం అయినా.. సామాజిక అంశాలపై మాత్రం సెన్సేషనల్ కామెంట్స్ చేస్తూ వార్తల్లో నిలుస్తున్నారు. తాజాగా, ఒక ఇంటర్వ్యూలో పాల్గొని భార్యాభర్తల బంధాలు, వివాహేతర సంబంధాలపై జీవిత చేసిన వ్యాఖ్యలు ఇప్పడు నెట్టింట దుమారం రేపుతున్నాయి. ఈ రోజుల్లో ఎవరూ శ్రీరామచంద్రుడిలా ఉండరని, తాను చేసే టీవీ షోలలోనూ ఇదే విషయాన్ని చెబుతుంటానని జీవిత స్పష్టం చేశారు. ఒక పురుషుడు వేరే మహిళతో పబ్లిక్‌గా తిరుగుతూ, తనకు అఫైర్ ఉందని బహిరంగంగా చెబితే.. అలాంటి వాడితో ఏ భార్య కూడా ఉండాల్సిన అవసరం లేదని అన్నారు. అయితే, కేవలం ఒక చిన్న అట్రాక్షన్‌తో భార్యకు తెలియకుండా, రహస్యంగా ఎఫైర్ పెట్టుకుంటే దాని గురించి భార్యలు పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదంటూ ఆమె షాకింగ్ కామెంట్స్ చేశారు. భార్యను ప్రేమిస్తున్నాడు కాబట్టే ఆ విషయాన్ని దాచాడని, మనం ప్రతిరోజూ ఒకే హోటల్‌లో భోజనం చేయం, ఒకే రకమైన బట్టలు వేసుకోం కదా.. అలాగే ఏదో కొత్తదనం కోసం భర్త ఆ తప్ప చేసి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. ఆ విషయం తర్వాత తెలిసినా సరే, దానిని పెద్ద ఇష్యూ చేయకుండా వదిలేయడమే మంచిదని హితవు పలికారు. కానీ, ఇంకో పెళ్లి చేసుకుని, వేరే ఫ్యామిలీ పెట్టి, మొదటి భార్యాపిల్లలను రోడ్డున పడేస్తే మాత్రం అలాంటి వాడిని అస్సలు క్షమించొద్దని చెప్పారు. భర్త తప్ప చేస్తే భార్య క్షమించాలన్నప్పడు, భార్య కూడా అలాగే చేస్తే మొగుడు కచ్చితంగా ఒప్పకోవాల్సిందేనని, ఆమెను కూడా క్షమించాలని స్పష్టం చేశారు. తన దగ్గరకు ఇలాంటి కేసులు చాలానే వచ్చాయని తెలిపారు. పూర్వం మగాడు బయటకు వెళ్లి సంపాదిస్తాడు కాబట్టి వాడే గొప్ప అనేవారని.. కానీ బయటకు వెళ్లి సంపాదించడం ఎంత పెద్ద పనో, ఇంట్లో ఉండి కుటుంబాన్ని చక్కబెట్టడం అంతకంటే పెద్ద పనని జీవితా రాజశేఖర్ పేర్కొన్నారు. ప్రస్తుతం జీవిత కామెంట్స్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ఇక ఈ విషయం తెలుసుకున్న వారంతా ఆమెపై విమర్శలు చేస్తున్నారు.

# ఒక్క అప్డేట్‌తో ఐదు సినిమాల ఆశలపై నీళ్లు చల్లిన ప్రభాస్

ఈ ఏడాది డిసెంబర్ నెలలో అనేక భారీ చిత్రాలు విడుదలకు సిద్ధమవుతున్నట్లు గత కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. ఇలాంటి సమయంలోనే ప్రభాస్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'ఫౌజీ' చిత్రాన్ని డిసెంబర్ 3న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. దీంతో డిసెంబర్‌లో విడుదలకు ప్లాన్ చేస్తున్న ఇతర చిత్రాల పరిస్థితి ఏంటనే చర్చలు సినీ వర్గాల్లో మొదలయ్యాయి. ఈ ఏడాది డిసెంబర్‌లో తెలుగు చిత్రాలతో పాటు పలు హిందీ సినిమాలు కూడా విడుదలకు సిద్ధమవుతున్నాయి.

బాలకృష్ణ - గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో 'ఎన్‌బీకే 111' వర్కింగ్ టైటిల్తో రూపొందుతున్న చిత్రాన్ని దసరా లేదా డిసెంబర్‌లో విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు సమాచారం. అలాగే చిరంజీవి - బాబీ కొల్లి కాంబినేషన్‌లో 'మెగా 158' వర్కింగ్ టైటిల్ తో రూపొందుతున్న చిత్రాన్ని కూడా డిసెంబర్‌లో విడుదల చేయాలని చూస్తున్నారు. ఇక నాగచైతన్య హీరోగా కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వృషకర్మ' చిత్రాన్ని కూడా డిసెంబర్‌లోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.

వీటితో పాటు అజయ్ దేవ్‌గన్, సంజయ్ దత్, తమన్నా ప్రధాన పాత్రల్లో రూపొందుతున్న 'రేంజర్', అలాగే అనీస్ బజ్మీ దర్శకత్వంలో అక్షయ్ కుమార్ నటిస్తున్న మరో హిందీ చిత్రం కూడా డిసెంబర్ విడుదలకే సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభాస్ 'ఫౌజీ' అదే నెలలో విడుదల కానుండటంతో మిగతా చిత్రాల విడుదల తేదీలపై ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో డిసెంబర్ బాక్సాఫీస్ పోరు మరింత ఆసక్తికరంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.



## ఇప్పడున్న టాలీవుడ్ స్టార్స్‌లో ఆ ఇద్దరంటే చాలా ఇష్టం



సీనియర్ స్టార్ హీరోయిన్లలో ఒకరైన రంభ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఎన్నో సంవత్సరాల పాటు తెలుగు సినీ పరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా కొనసాగిన ఆమె తన అందం, నటనతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉంటున్న రంభ, పలు టెలివిజన్ షోల్లో జడ్జిగా వ్యవహరిస్తూ బుల్లితెర ప్రేక్షకులను అలరిస్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రంభ ప్రస్తుతం తనకు అత్యంత ఇష్టమైన ఇద్దరు టాలీవుడ్ స్టార్ హీరోలు ఎవరో వెల్లడించింది.

ఆమె మాట్లాడుతూ... ప్రస్తుతం తెలుగు సినీ పరిశ్రమలో ఉన్న హీరోల్లో ప్రభాస్, మహేష్‌బాబు అంటే నాకు చాలా ఇష్టం. వారిద్దరూ తమ అద్భుతమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. వారి నటనను నేను ఎంతో అభిమానిస్తాను. వీరిద్దరిలో ఎవరితో సినిమా చేసే అవకాశం వచ్చినా చాలా సంతోషిస్తాను. ఇద్దరితో కలిసి నటించే అవకాశం వస్తే ఇంకా ఆనందంగా ఉంటుందని చెప్పింది. రంభ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కాగా ఈ తరం స్టార్ హీరోల్లో అల్లు అర్జున్ నటించిన 'దేశముదురు' చిత్రంలోని ఐటమ్ సాంగ్లో రంభ కనిపించి ప్రేక్షకులను అలరించిన విషయం

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500201. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.